

APTEL/26/A4813

# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త




సంపుటి : 01 సంచిక :58 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజిలు : 08, వెల రూ. 2రూ/ శనివారం - 05 - సెప్టెంబర్ - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad




## రికార్డు సృష్టించిన ఇటలీ ప్రధాని..
## 'నా స్నేహితురాలు మెలోనీ' అంటూ మోదీ అభినందనలు

- ఇటలీలో ఎక్కువ కాలం పనిచేసిన ప్రధానిగా రికార్డు సృష్టించిన మెలోనీ
- మెలోనీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేసిన ప్రధాని మోదీ
- ఇరు దేశాల మధ్య ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతంపై హర్షం
- మెలోనీ స్నేహం ఎంతో విలువైందంటూ మోదీ ప్రశంసలు
- గతంలో మోదీకి కూడా ఇలాగే శుభాకాంక్షలు తెలిపిన మెలోనీ

## దాడులు ఆపితేనే.. ఇరాన్‌తో చర్చలపై అమెరికా కీలక నిర్ణయం



- హర్మూజ్‌లో ఆపరేషన్లకు గడువు లేదని వాన్స్ వెల్లడి
- ఇంధన రవాణా కొనసాగించడమే అమెరికా ప్రధాన లక్ష్యం
- ఇరాన్‌పై అన్ని రకాల ఒత్తిళ్లు కొనసాగుతాయని హెచ్చరిక
- అమెరికాకు చైనా కొంత సహకరిస్తోందని వాన్స్ వ్యాఖ్య
- పలు గల్ఫ్ దేశాలు ఇరాన్‌పై ఒత్తిడికి సహకారం



## ఏపీలో ఉత్తమ ఉపాధ్యాయుల
# జాబితా విడుదల

- పాఠశాల విద్యాశాఖ నుంచి 79 మంది, ఇంటర్ బోర్డు నుంచి 24 మందిని ఎంపిక
- ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, లెక్చరర్లు, ప్రిన్సిపాళ్ల పేరుతో జీవో జారీ

అమరావతి: 2026 సంవత్సరానికి గాను ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. పాఠశాల విద్యాశాఖ నుంచి 79 మంది, ఇంటర్ బోర్డు నుంచి 24 మందిని ఎంపిక చేసింది. ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, లెక్చరర్లు, ప్రిన్సిపాళ్ల పేరుతో జీవో జారీ చేసింది. రాష్ట్రస్థాయి కమిటీ సిఫార్సుల మేరకు ఈ అవార్డులను ఖరారు చేశారు. శనివారం గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ప్రభుత్వం సత్కరించనుంది.

## స్థానిక ఎన్నికలే లక్ష్యం.. ఎన్డీయే సమన్వయ కమిటీ కీలక భేటీ

ఎన్నికల సన్నద్ధత, భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయంపై విస్తృత చర్చ



- క్షేత్రస్థాయిలో ఐక్యంగా పనిచేయాలని నాయకుల నిర్ణయం
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తీర్మానం

అమరావతి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎన్డీయే కూటమి సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో భాగస్వామ్య పక్షాల సమన్వయ కమిటీ కీలక సమావేశం నిర్వహించింది. ఎన్నికల వ్యూహాలు, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

## ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు
# ప్రభుత్వం సిద్ధంగా ఉంది

### ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలతో చంద్రబాబు నేడు కీలక భేటీ



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో రేపు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. కొత్త పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ అమలుతో పాటు కరవు భత్యం బకాయిలు తదితర కీలక అంశాలపై ఈ భేటీలో సమగ్రంగా చర్చించనున్నారు. నిన్న సచివాలయంలో ఏపీ జేఏసీ నాయకులు ఎ. విద్యాసాగర్, డీవీ రమణ, భారతీ ప్రసాద్ తదితరులు సీఎం చంద్రబాబును కలిశారు. ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న ఆందోళనలను, ఆర్థికేతర సదుపాయాల పెండింగ్ అంశాలను విద్యాసాగర్ సీఎంకు వివరించి, తక్షణ పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి... ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అత్యంత కట్టుబడి ఉందో స్పష్టం చేశారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగులకు అందాల్సిన న్యాయమైన ప్రయోజనాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి సానుకూలంగా చర్చలు జరుపుతున్న తరుణంలో, ఉద్యోగ సంఘాలు తొందరపడి ఆందోళన బాట పట్టడంపై సీఎం చంద్రబాబు కొంత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సమగ్ర చర్చల వేదిక అందుబాటులో ఉన్నప్పుడు కొద్దిగా ఓర్పు వహించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రితో భేటీపై హర్షం వ్యక్తం చేసిన ఏపీ జేఏసీ నేతలు... ప్రభుత్వం వైపు నుంచి సానుకూల చర్చల ప్రక్రియను స్వాగతిస్తున్నామని, సీఎం స్థాయిలోనే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.




## సోనియా గాంధీ పుస్తకానికి కొత్త పబ్లిషర్.. నవంబర్ 10న విడుదల

- సోనియా గాంధీ పుస్తకానికి కొత్త పబ్లిషర్‌గా హార్పర్‌కాలిన్స్
- నవంబర్ 10న భారత్‌లో 'బిలాంగింగ్' విడుదల
- పెంగ్విన్ ప్రచురణపై వచ్చిన వార్తలను సంస్థ ఖండన
- పుస్తకంలో సోనియా వ్యక్తిగత, రాజకీయ ప్రయాణం

2లో

## అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం
# తప్పుడు ప్రచారం

- ఏపీ అక్షరాస్యతపై మంత్రి లోకేశ్ ప్రకటనను తప్పుబట్టిన జగన్
- ఇది పూర్తిగా తప్పుడు సమాచారంతో కూడిన ప్రచారమని విమర్శ
- కేంద్ర ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ వివరణ ఇచ్చిన మాజీ సీఎం
- ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు తగ్గుతున్నారని ఆందోళన వ్యక్తీకరణ
- విద్యాశాఖపై దృష్టి పెట్టాలని లోకేశ్‌కు సూచించిన జగన్



అమరావతి: ఏపీలో అక్షరాస్యత రేటు 2024లో 72.6శాతం నుంచి 2026 నాటికి 82.1శాతానికి పెరిగిందంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రంగా స్పందించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మిగతా 2 లో

## నిరీక్షణ ముగిసింది..
## త్వరలో కీలక నిర్ణయాన్ని ప్రకటిస్తా

### మంత్రి పదవి నుంచి తొలగింపు తర్వాత మౌనం వీడిన కొండా సురేఖ

- త్వరలోనే కీలక నిర్ణయం ప్రకటిస్తానని సోషల్ మీడియాలో పోస్ట్
- సీఎం రేవంత్‌కు సవాల్ విసిరిన కొండా సురేఖ కుమార్తె సుస్మిత
- తన వ్యాఖ్యల వల్లే తల్లిపై వేటు వేశారని సుస్మిత ఆవేదన
- కొండా ఫ్యామిలీ తదుపరి అడుగుపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ



హైదరాబాద్: మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ అయిన తర్వాత కొండా సురేఖ ఎట్టకేలకు తన మౌనాన్ని వీడారు. త్వరలోనే ఓ కీలక నిర్ణయం ప్రకటిస్తానని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. "నిరీక్షణ ముగిసింది.. త్వరలో కీలక నిర్ణయాన్ని ప్రకటిస్తా" అని ఆమె చేసిన పోస్ట్ రాష్ట్ర రాజకీయాల్లో మిగతా 2 లో

## దేశభక్తిలో మోదీ, అమిత్ షాలకు
# అసద్ తక్కువేమీ కాదు

### ఎంఐఎం దేశ వ్యతిరేకమనేది దుష్ప్రచారమన్న రేవంత్

- ఓల్డ్‌సిటీ అభివృద్ధిపై అసద్, అక్బర్‌తో చర్చించానని వెల్లడి
- అసద్ సూచించిన అభివృద్ధి పనులను వెంటనే మంజూరు చేయాలని ఆదేశం
- పాతబస్తీ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ
- హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు నిర్మించడమే లక్ష్యమని వెల్లడి



హైదరాబాద్: ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశభక్తి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు అసదుద్దీన్ ఒవైసీ ఏమీ తక్కువ కాదన్నారు. అసద్, ఎంఐఎం దేశానికి వ్యతిరేకమంటూ జరుగుతున్న ప్రచారం దుష్ప్రచారం మాత్రమేనని చెప్పారు. సైదాబాద్ స్టీల్ బ్రిడ్జిని సీఎం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. అసదుద్దీన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. మిగతా 2 లో

## బాసర నుంచి భద్రాచలం వరకు
# ఆలయాలన్నీ అభివృద్ధి చేస్తాం

- రూ.351 కోట్లతో చేపడుతున్న ఆలయ పునర్నిర్మాణ పనులను మంత్రి పరిశీలన
- బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్న అన్ని ఆలయాలను పుష్కరాల నాటికి అభివృద్ధి చేయాలి



భద్రాచలం: భద్రాచలం సీతారామచంద్రస్వామివారిని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దర్శించుకున్నారు. ప్రధాన ఆలయంలోని స్వామి వారి ఎదుట ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.351 కోట్లతో చేపడుతున్న ఆలయ పునఃనిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. భద్రాద్రి ఆలయాన్ని భక్తులు మెచ్చేలా విశాలంగా, అత్యంత సుందరంగా పునర్నిర్మిస్తామని తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్న అన్ని ఆలయాలను పుష్కరాల నాటికి అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. అందులోభాగంగానే రాములోరి ఆలయాన్ని, భద్రాచలం పట్టణాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు.



## కేసీఆర్ చాలా మంచోడు
# కొండా సురేఖ ప్రశంసలు

- వార్తా ఛానళ్లకు వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్న కొండా సురేఖ
- కేసీఆర్ తమను హుందాగా రిసీవ్ చేసుకునేవారని వెల్లడి
- కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారన్న సురేఖ

## రికార్డు సృష్టించిన ఇటలీ ప్రధాని..
# ‘నా స్నేహితురాలు మెలోనీ’ అంటూ మోదీ అభినందనలు

ఢిల్లీ: ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆ దేశ రాజకీయ చరిత్రలో ఒక అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. యుద్ధానంతర ఇటలీ చరిత్రలో అత్యధిక కాలం నిరంతరాయంగా ప్రధానిగా పనిచేసిన వ్యక్తిగా ఆమె నిలిచారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. మెలోనీని ‘నా స్నేహితురాలు’ అని సంబోధిస్తూ, ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఈ మైలురాయే నిదర్శనమని ప్రశంసించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’ వేదికగా మోదీ స్పందిస్తూ.. “ఇటలీ యుద్ధానంతర చరిత్రలో సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగుతున్న నా స్నేహితురాలు జార్జియా మెలోనీకి అభినందనలు. ఈ విజయం ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలు ఉంచిన నమ్మకానికి, విశ్వాసానికి ప్రతీక” అని పేర్కొన్నారు. భారత్-ఇటలీ మధ్య ‘ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం’ బలోపేతం కావడంలో మెలోనీ స్నేహం కీలక పాత్ర పోషించిందని మోదీ అన్నారు. భవిష్యత్తులో కూడా ఇరు దేశాల ప్రజల శ్రేయస్సు కోసం కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. 2022 అక్టోబర్ 22న ఇటలీ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన జార్జియా మెలోనీ, ఇవాల్టికి 1,413 రోజులు పదవిలో పూర్తి చేసుకున్నారు. తద్వారా మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోనీ రికార్డును ఆమె అధిగమించారు. గత జులైలో ప్రధాని మోదీ భారత చరిత్రలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా నిలిచినప్పుడు మెలోనీ కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇరు దేశాల ప్రజలకు కొత్త అవకాశాలు సృష్టించేందుకు కలిసి పనిచేస్తామని ఆమె పేర్కొన్నారు. గత మే నెలలో మోదీ ఇటలీలో పర్యటించినప్పుడు ఇరు దేశాల సంబంధాలను ‘ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం’ స్థాయికి పెంచుతూ ఇరు నేతలు నిర్ణయం తీసుకున్నారు. ఈ పర్యటన సందర్భంగా మోదీ, మెలోనీకి సరదాగా ‘మెలోడీ’ చాక్లెట్ల ప్యాకెట్‌ను బహుమతిగా ఇచ్చారు. సోషల్ మీడియాలో వారిద్దరి పేర్లతో వైరల్ అయిన ‘చవీవశ్రీశీఎఱ’ ట్రెండ్‌ను ఇది గుర్తుచేసింది. ఈ ఆసక్తికర క్షణాలను మెలోనీ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇరు నేతల మధ్య ఉన్న ఈ స్నేహపూర్వక వాతావరణం ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## దాడులు ఆపితేనే..
# ఇరాన్‌తో చర్చలపై అమెరికా కీలక నిర్ణయం

ఢిల్లీ: ఇరాన్‌తో చర్చలకు అమెరికా తాత్కాలికంగా బ్రేక్ వేసింది. వాణిజ్య నౌకలపై దాడులు ఆపే వరకు టెహ్రాన్‌తో చర్చలు జరిపే ప్రసక్తే లేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పష్టం చేశారు. ఇరాన్ చర్యలను బట్టి తమ ఆపరేషన్లు కొనసాగుతాయని చెప్పారు. వాటికి ఎలాంటి గడువు విధించబోమన్నారు. వైట్‌హౌస్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో వాన్స్ మాట్లాడారు. వాణిజ్య నౌకలపై దాడులు కొనసాగుతున్నంత కాలం ఇరాన్‌తో చర్చలు ఉండవని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టంగా చెప్పారని తెలిపారు. హర్మూజ్ జలసంధిలో ఇంధన రవాణా సజావుగా సాగడమే ప్రస్తుతం అమెరికా ప్రధాన లక్ష్యమని వాన్స్ చెప్పారు. తమ చర్యల వల్ల గురువారం రాత్రి 1.5 కోట్ల బ్యారెళ్ల చమురు హర్మూజ్ జలసంధి నుంచి బయటకు వెళ్లిందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం రాకుండా అమెరికా చర్యలు అడ్డుకున్నాయని తెలిపారు. ఇరాన్‌పై ఒత్తిడి పెంచేందుకు అమెరికా వద్ద ఆర్థిక, సైనిక, దౌత్య, రహస్య చర్యలు సహా అన్ని మార్గాలు ఉన్నాయని వాన్స్ చెప్పారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని తిరిగి నిర్మించకుండా అడ్డుకోవడం కూడా తమ లక్ష్యమన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి పెంచడంలో చైనా సహకరిస్తోందని వాన్స్ తెలిపారు. టెహ్రాన్‌కు ఆర్థిక సేవలను పరిమితం చేసే విషయంలో చైనా కొన్ని అమెరికా అభ్యర్థనలకు స్పందించిందన్నారు. టర్కీ, అజర్‌బైజాన్, యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్ కూడా ఇరాన్‌పై ఒత్తిడి పెంచడంలో సహకరిస్తున్నాయని చెప్పారు. హర్మూజ్ జలసంధి ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలక మార్గం. గల్ఫ్ దేశాల నుంచి అంతర్జాతీయ మార్కెట్లకు చమురు తరలింపులో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఇక్కడ రవాణాకు అంతరాయం ఏర్పడితే ఇంధన ధరలు, బీమా ఖర్చులు, రవాణా వ్యయం పెరిగే అవకాశం ఉంది.

## స్థానిక ఎన్నికలే లక్ష్యం..
# ఎన్డీయే సమన్వయ కమిటీ కీలక భేటీ

అమరావతి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎన్డీయే కూటమి సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో భాగస్వామ్య పక్షాల సమన్వయ కమిటీ కీలక సమావేశం నిర్వహించింది. ఎన్నికల వ్యూహాలు, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఎన్నికల సన్నద్ధత, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం, నాయకులు-కార్యకర్తల మధ్య ఐక్యత వంటి అంశాలు ఈ భేటీలో ప్రధాన అజెండాగా ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల విజయాన్ని లక్ష్యంగా చేసుకుని పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని నాయకులు నిర్ణయించారు. గ్రామ, మండల స్థాయిలలో కూటమి నేతలంతా సమన్వయంతో పనిచేయాలని తీర్మానించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకుని, ఐక్యంగా పనిచేయడం ద్వారా స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని నాయకులు పిలుపునిచ్చారు.

## సోనియా గాంధీ పుస్తకానికి కొత్త పబ్లిషర్..
# నవంబర్ 10న విడుదల

ఢిల్లీ: సోనియా గాంధీ రాసిన ‘బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్’ పుస్తకానికి భారత్‌లో కొత్త ప్రచురణకర్త ఖరారైంది. ‘హార్పర్‌కాలిన్స్ ఇండియా’ ఈ పుస్తకాన్ని ప్రచురించనుంది. 2026 నవంబర్ 10న భారత్‌లో పుస్తకం విడుదల కానుంది. ఈ విషయాన్ని ‘హార్పర్‌కాలిన్స్ ఇండియా’ శుక్రవారం ప్రకటించింది. అత్యంత ఆసక్తి రేపుతున్న రాజకీయ జ్ఞాపకాల పుస్తకాల్లో ఇదొకటని తెలిపింది. ప్రేమ, గుర్తింపు, బాధ్యత, అనుబంధం వంటి అంశాల చుట్టూ సోనియా గాంధీ వ్యక్తిగత జీవితాన్ని ఇందులో వివరించినట్లు పేర్కొంది. ఇటీవల సోనియా గాంధీ పుస్తకానికి పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా ప్రచురణకర్త కాదని ప్రకటించింది. పుస్తకంలోని కొన్ని అంశాలపై రచయితతో చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడిందని సంస్థ తెలిపింది. అయితే సంపాదకీయ మార్పులకు సోనియా గాంధీ అంగీకరించకపోవడంతోనే పుస్తక ప్రచురణ నుంచి తప్పుకున్నారన్న వార్తలను పెంగ్విన్ ఖండించింది. బాహ్య ఒత్తిడి కారణం కాదని స్పష్టం చేసింది. ‘బిలాంగింగ్’ పుస్తకాన్ని అమెరికాకు చెందిన ఆల్ఫ్రెడ్ ఏ.నాఫ్ నవంబర్ 10న విడుదల చేయనున్నట్లు గతంలో ప్రకటించింది. భారత్‌లో మాత్రం ప్రచురణ బాధ్యతలు ఇప్పుడు ‘హార్పర్‌కాలిన్స్ ఇండియా’కు దక్కాయి. ఈ పుస్తకంలో సోనియా గాంధీ తన ఆరు దశాబ్దాల అనుభవాలను ప్రస్తావించారు. 1984లో అత్త ఇందిరా గాంధీ హత్యతో తన జీవితం ఎలా మారిందో వివరించారు. 1991లో భర్త రాజీవ్ గాంధీ హత్య తర్వాత ఎదురైన పరిస్థితులనూ పంచుకున్నారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన తీరాన్ని పుస్తకంలో ప్రస్తావించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సుదీర్ఘకాలం కొనసాగిన సోనియా గాంధీ.. ప్రధానమంత్రి పదవిని చేపట్టే అవకాశం వచ్చినా తిరస్కరించారు. 2014లో కాంగ్రెస్ అధికారం కోల్పోయి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భాజపా అధికారంలోకి వచ్చిన పరిణామాలనూ ఆమె తన పుస్తకంలో ప్రస్తావించారు.

## కేసీఆర్ చాలా మంచోడు
# కొండా సురేఖ ప్రశంసలు



హైదరాబాద్: మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌కు గురైన కొండా సురేఖ వరుస ఇంటర్వ్యూలతో కాంగ్రెస్ సర్కార్‌పై, పార్టీ అంతర్గత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆమె ప్రశంసల వర్షం కురిపించడం... ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కేసీఆర్ వ్యవహారశైలి ఎలా ఉండేదన్న ప్రశ్నకు సురేఖ స్పందిస్తూ... “కేసీఆర్ గారు చాలా మంచి వ్యక్తి. తమను ఎప్పుడు కలిసినా ఎంతో గౌరవంగా, హుందాగా రిసీవ్ చేసుకునేవారు” అని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీలో పనిచేసినన్ని రోజులు కేసీఆర్‌తో తమకు ఎలాంటి విభేదాలు రాలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం అడిగిన వెంటనే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. నాడు కొండా మురళికి ఎమ్మెల్సీ పీఠం దక్కకుండా పార్టీలోని కడియం శ్రీహరి వంటి కొందరు సీనియర్ నేతలు అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, కానీ కేసీఆర్ స్వయంగా జోక్యం చేసుకుని మిగిలిన వారి నామినేషన్లను ఉపసంహరింపజేసి మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చూశారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తీవ్ర అసంతృప్తితో, బర్తరఫ్ వేటుతో బయటకు వచ్చిన కొండా సురేఖ.. కేసీఆర్ పాలనను, ఆయన వ్యక్తిత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తడం వెనుక రాజకీయ ప్రాధాన్యత ఉందనే విశ్లేషణలు మొదలయ్యాయి. కేసీఆర్‌పై సురేఖ చేసిన సానుకూల వ్యాఖ్యల నేపథ్యంలో కొండా దంపతులు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి... బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందా? అనే ప్రచారం జోరందుకుంది.

# అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం

మొదటి పేజి తరువాయి

చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ‘ఎక్స్’ వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 2026 క్యాలెండర్ సంవత్సరం ఇంకా పూర్తి కానందున, అక్షరాస్యతకు సంబంధించి ఏ అధికారిక సంస్థ కూడా గణాంకాలను విడుదల చేయలేదని జగన్ స్పష్టం చేశారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖకు చెందిన ఎన్ఎస్ఎస్ఓ విడుదల చేసిన ‘పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే’ (పీఎల్ఎఫ్ఎస్) 2023-24 వార్షిక నివేదికను ఆయన ఉటంకించారు. దాని ప్రకారం.. 2023 జూన్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలో ఏపీలో ఏడేళ్లకు పైబడిన వారిలో అక్షరాస్యత 72.6శాతంగా ఉందని, ఇదే 2018-19లో 69.1శాతంగా ఉండేదని గుర్తుచేశారు. అంతేకాకుండా, 2026 జులై 2న ప్రచురించిన పీఎల్ఎఫ్ఎస్ 2025 నివేదిక ప్రకారం.. 2025 జనవరి నుంచి 2025 డిసెంబర్ మధ్య కాలంలో రాష్ట్ర అక్షరాస్యత 71.4శాతంగా నమోదైందని తెలిపారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం తప్పుడు వాదనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం అత్యంత దురదృష్టకరమని జగన్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గి, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడీఐఎస్ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని, ఇది ఆందోళన కలిగించే విషయమని జగన్ అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యను మరింత అందుబాటులోకి ఎలా తీసుకురావాలనే దానిపై దృష్టి పెట్టాల్సింది పోయి, టీడీపీ కూటమి ప్రభుత్వం మోసపూరిత వ్యూహాలతో తప్పుడు ప్రచారాలు చేసుకోవడంలో నిమగ్నమైందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి తన శాఖపై ఎక్కువ సమయం కేటాయించాలి కానీ ‘రెడ్ బుక్ గవర్నెన్స్’ మీద కాదని లోకేశ్‌కు హితవు పలికారు.

## నిరీక్షణ ముగిసింది..
# త్వరలో కీలక నిర్ణయాన్ని ప్రకటిస్తా

మొదటి పేజి తరువాయి

అని ఆమె చేసిన పోస్ట్ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సురేఖ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మరోవైపు, తన తల్లిని మంత్రి పదవి నుంచి తొలగించడంపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే తన తల్లిపై పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. తాను రేవంత్ రెడ్డి కుటుంబ అవినీతి గురించి వ్యక్తిగతంగా మాట్లాడానని, అంతమాత్రానికే తన తల్లిపై వేటు వేయడం సరికాదని సుస్మిత అన్నారు. తన వ్యాఖ్యలకు, పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. “నా తల్లిని ఇలా చూడటం బాధగా ఉంది. ఈ విషయంలో నేను రేవంత్ రెడ్డిని శపిస్తున్నాను” అని సుస్మిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో సురేఖ భర్త కొండా మురళి మీసాలు మెలివేయడం వంటి పరిణామాలు.. కొండా ఫ్యామిలీ ‘ప్లాన్ బీ’ ఏమై ఉంటుందనే ఉత్కంఠను మరింత పెంచుతున్నాయి. మొత్తం మీద ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి.

## దేశభక్తిలో మోదీ, అమిత్ షాలకు
# అసద్ తక్కువేమీ కాదు

మొదటి పేజి తరువాయి

ఓల్డ్‌సిటీ అభివృద్ధిపై తాను అసదుద్దీన్, అక్బరుద్దీన్‌తో చర్చించినట్లు తెలిపారు.

గత ప్రభుత్వంపై విమర్శలు

సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి గత ప్రభుత్వం కొబ్బరికాయ కొట్టిందే తప్ప ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాతే పనులు ముందుకు సాగాయని చెప్పారు. ఇన్నేళ్లలో ఎంతమంది ముఖ్యమంత్రులు ఓల్డ్‌సిటీకి వచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. పాతబస్తీ గల్లీల్లోకి తాను తప్ప మరెవరూ రాలేదన్నారు.

అసద్ చెప్పిన పనులకు వెంటనే అనుమతులు

ఓల్డ్‌సిటీ అభివృద్ధి కోసం అసదుద్దీన్ ఏది సూచించినా వెంటనే పరిశీలించి మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశిస్తున్నట్లు రేవంత్ చెప్పారు. పాతబస్తీలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వడమే తమ లక్ష్యమన్నారు. పెద్దలు ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు.

హిందూ, ముస్లింలు కలిసి ఉండాలి

ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇచ్చింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వమేనని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. రాష్ట్రంలో హిందువులు, ముస్లింలు కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షించారు.

## నింగిలోకి ఈవోఎస్-05..
# ఇస్రో ఖాతాలో మరో భారీ విజయం!

ఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. శుక్రవారం తెల్లవారుజామున 2:55 గంటలకు, శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ద్వారా ఈవోఎస్-05 (జిశాట్-1ఏ) ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. ఈ ప్రయోగంతో భారత అంతరిక్ష సామర్థ్యం మరో మెట్టు పైకెక్కినట్లయింది. భూస్థిర కక్ష్య నుంచి పనిచేయనున్న భారత్ తొలి ఇమేజింగ్ శాటిలైట్ ఇదే కావడం ఈ ప్రయోగం ప్రత్యేకత. భూమికి దాదాపు 36,000 కిలోమీటర్ల ఎత్తులో ఉంటూ, భూభ్రమణంతో పాటే ఇది తిరుగుతుంది. దీనివల్ల భారత ఉపఖండం, పరిసర ప్రాంతాలపై నిరంతరం ఒక కన్ను వేసి ఉంచడం సాధ్యమవుతుంది. సాధారణంగా లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లోని ఉపగ్రహాలు ఒక ప్రాంతంపై నుంచి పరిమిత సమయం మాత్రమే వెళ్తాయి. కానీ, ఈవోఎస్-05 స్థిరంగా ఒకే ప్రాంతాన్ని పర్యవేక్షించగలదు. ఈ ఉపగ్రహం ప్రతి 30 నిమిషాలకు ఒకసారి మొత్తం భారత భూభాగాన్ని చిత్రీకరించగలదు. ప్రకృతి వైపరీత్యాలైన తుఫానులు, వరదలు, అడవుల్లో కార్చిచ్చులను ముందుగా పసిగట్టడంలో, వాతావరణ మార్పులను గమనించడంలో ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. వ్యవసాయం, జలవనరుల నిర్వహణ, సరిహద్దు ప్రాంతాల పర్యవేక్షణలో కూడా ఇది కీలక పాత్ర పోషించనుంది. ఐదేళ్ల క్రితం, అంటే 2021 ఆగస్టులో, జీఎస్ఎల్వీ-ఎఫ్10 రాకెట్ సాంకేతిక వైఫల్యం కారణంగా జిశాట్-1 (ఈవోఎస్-03) మిషన్ విఫలమైన విషయం తెలిసిందే. ఆ లోటును పూడ్చుతూ, ఇప్పుడు ఈవోఎస్-05ను విజయవంతంగా ప్రయోగించి ఇస్రో తన సత్తా చాటింది. ప్రస్తుతం ఉపగ్రహం సబ్-జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లో ఉందని, దాని సోలార్ ప్యానెళ్లు తెరుచుకొని పనిచేస్తున్నాయని ఇస్రో తెలిపింది. రాబోయే రోజుల్లో దశలవారీగా కక్ష్యను పెంచుతూ, దానిని తుది భూస్థిర కక్ష్యలో ప్రవేశపెడతారు. ఈ ప్రయోగం భారత భూపర్యవేక్షణ రంగంలో ఒక కీలక మైలురాయిగా నిలవనుంది.

## రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్ రహస్యాలు బహిర్గతం..
# ‘తెలుగు స్క్రైబ్’పై సైబర్ క్రైమ్ కేసు



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు సంబంధించిన అత్యంత రహస్య భద్రతా సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారన్న ఆరోపణలపై ‘తెలుగు స్క్రైబ్’ అనే ఎక్స్ ఖాతా నిర్వాహకులపై కేసు నమోదైంది. సీఎం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో) కేబీ ఫ్రాంక్లిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రేవంత్ రెడ్డి జులై 13న ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. ఈ పర్యటనకు సంబంధించి ఆయన నిమిషం-నిమిషం కార్యక్రమం, జడ్-ప్లస్ భద్రతా ఏర్పాట్లు, సీఎస్‌వో అధికారిక మొబైల్ నంబర్, అత్యవసర పరిస్థితుల కోసం సీఎం బ్లడ్ గ్రూప్ వంటి సున్నితమైన వివరాలతో కూడిన వైర్‌లెస్ సందేశాన్ని సీఎం ప్రైవేట్ సెక్రటరీ కార్యాలయం నుంచి సంబంధిత అధికారులకు పంపించారు. అయితే, అదే రోజు ఈ రహస్య సమాచారాన్ని ‘తెలుగు స్క్రైబ్’ తమ ఎక్స్ ఖాతాలో ప్రచురించింది. దీంతో సీఎం భద్రతకు సంబంధించిన వ్యూహాత్మక వివరాలు బహిర్గతమయ్యాయి. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన సీఎం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కేబీ ఫ్రాంక్లిన్, జులై 14న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్యంత గోప్యంగా ఉండాల్సిన సమాచారం బయటకు రావడం భద్రతకు ముప్పు కలిగించే చర్య అని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారుల్లో ఎవరో ఒకరు ఈ సమాచారాన్ని అక్రమంగా లీక్ చేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తొలుత ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఉన్నతాధికారుల ఆదేశాలతో దర్యాప్తు కోసం దీనిని సైబర్ క్రైమ్ పోలీసులకు బదిలీ చేశారు. భారతీయ న్యాయ సంహిత, ఐటీ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఈ కేసు నమోదుపై ‘తెలుగు స్క్రైబ్’ ఎక్స్ వేదికగా స్పందించింది. “ఢిల్లీ పర్యటనలపై వార్త రాసినందుకు రేవంత్ రెడ్డి మరో మెడల్ ఇచ్చారు. దేశంలో ఒక సీఎం తన పర్యటనలపై వార్త రాసినందుకు కేసు పెట్టడం ఇదే మొదటిసారి” అని తమ పోస్ట్‌లో పేర్కొంది. గతంలోనూ ఈ సోషల్ మీడియా హ్యాండిల్ ప్రభుత్వం, సీఎంపై విమర్శనాత్మక పోస్టులు పెడుతూ ఉండేది. ఈ ఏడాది ఏప్రిల్‌లో యూఏపీఏ సెక్షన్ కింద ఈ ఖాతా వివరాలు ఇవ్వాలంటూ పోలీసులు ‘ఎక్స్’కు నోటీసులు పంపడం అప్పట్లో చర్చనీయాంశమైంది.

## సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం.. సర్వేపల్లి
## రాధాకృష్ణన్ జయంతి వెనుక ఉన్న స్ఫూర్తిదాయక కథ!




ఢిల్లీ: భారతదేశవ్యాప్తంగా ప్రతి ఏటా సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాన్ని (టీచర్స్ డే) ఎంతో ఘనంగా జరుపుకుంటారు. మన భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించే గురువులను స్మరించుకుని, వారి సేవలకు కృతజ్ఞతలు తెలిపే ఈ ప్రత్యేకమైన రోజు, మన దేశ రెండవ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త, విద్యావేత్త అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి కూడా. ఆయన కోరిక మేరకే ఆయన పుట్టినరోజును గురుపూజోత్సవంగా జరుపుకోవడం దశాబ్దాలుగా ఆనవాయతీగా వస్తోంది. ఈ సంప్రదాయం వెనుక ఒక ఆసక్తికరమైన, స్ఫూర్తిదాయకమైన కథ ఉంది. 1962లో సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన శిష్యులు, మిత్రులు కొందరు సెప్టెంబర్ 5న ఆయన పుట్టినరోజును ఘనంగా నిర్వహించడానికి అనుమతి కోరారు. దానికి ఆయన ఎంతో వినమ్రంగా స్పందించారు. తన పుట్టినరోజును వ్యక్తిగత వేడుకగా కాకుండా దేశంలోని ఉపాధ్యాయులందరినీ గౌరవించేలా ‘ఉపాధ్యాయ దినోత్సవం’గా జరపాలని సూచించారు. ఆ మహనీయుడి నిరాడంబరత, గురువుల పట్ల ఆయనకున్న అపారమైన గౌరవం ఈ గొప్ప సంప్రదాయానికి నాంది పలికాయి. 1888లో జన్మించిన డాక్టర్ రాధాకృష్ణన్ కేవలం రాజనీతిజ్ఞుడే కాదు, అంతకుమించి గొప్ప విద్యావేత్త. ఆయన తన జీవితంలో ఎక్కువ కాలాన్ని బోధనకే అంకితం చేశారు. కలకత్తా యూనివర్సిటీ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వంటి ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థల్లో ఆయన ఆచార్యులుగా పనిచేశారు. యువత ఆలోచనలను, తద్వారా సమాజ నిర్మాణాన్ని ఉపాధ్యాయులే సరైన మార్గంలో నడిపించగలరని ఆయన బలంగా విశ్వసించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా సెప్టెంబర్ 5న దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో గురుపూజోత్సవ వేడుకలు అంబరాన్నంటుతున్నాయి. విద్యార్థులు తమ గురువులకు బహుమతులు అందించి, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి తమ కృతజ్ఞతను చాటుకుంటారు. ఈ సందర్భంగా ప్రభుత్వాలు కూడా ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులతో సత్కరిస్తాయి. సర్వేపల్లి రాధాకృష్ణన్ అందించిన ఈ గొప్ప వారసత్వం, గురువుల ప్రాముఖ్యతను ప్రతి ఏటా మనందరికీ గుర్తుచేస్తూనే ఉంటుంది.

## బాండ్ పేపర్లపై రాసిచ్చిన హామీలు ఏమయ్యాయి ?




మెదక్: రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులైనా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు 420 హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు దుయ్యబట్టారు. వెయ్యి రోజుల పాలన వైఫల్యాలను ఎండగడుతూ మెదక్ జిల్లా కౌడిపల్లిలో గురువారం భారాస ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు హాజరై మాట్లాడారు. వంద రోజుల్లో నెరవేరుస్తామని ఇచ్చిన బాండ్ పేపర్ల హామీలు ఏమయ్యాయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతుబీమాను బంద్ చేసి, రైతుబంధు ఎగ్గొట్టి రూ.29 వేల కోట్లు రేవంత్ సర్కారు లూటీ చేసిందని ఆరోపించారు. రుణమాఫీపై చర్చకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డికి సవాలు విసిరారు. కౌడిపల్లిలో అందరికీ రుణమాఫీ జరిగిందని తేలితే తాను రాజీనామా చేయడానికి సిద్ధమని, మాఫీ కాలేదని తేలితే రాజీనామా చేస్తారా అని ప్రశ్నించారు. ఇంజినీరింగ్ విద్యార్థులను క్రిమినల్ వేస్ట్ అంటారా అని దుయ్యబట్టారు. రైతులకు చెందిన పట్టాభూములను నిషేధిత జాబితాలో చేర్చిన కాంగ్రెస్‌ను వచ్చే ఎన్నికల్లో అదే జాబితాలో వేయాలని కోరారు. రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు 77 సార్లు దిల్లీకి వెళ్లారని, వెయ్యి రోజుల్లో సుమారు 300 రోజులు అక్కడే ఉన్నారన్నారు. విమానం టికెట్లు దండగ తప్ప రాష్ట్రానికి తెచ్చింది శూన్యమని, కాంగ్రెస్ పాలన కుట్రలు, కబ్జాలు, సెటిల్‌మెంట్లకే పరిమితమైందని హరీశ్ ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉనికిని కాపాడుకునేందుకే భాజపా నేతల విమర్శలు



హైదరాబాద్: తమ పార్టీలో నెలకొన్న అంతర్గత పోరులో అధిష్ఠానం వద్ద ఉనికిని కాపాడుకునేందుకే భాజపా రాష్ట్ర నేతలు ఒకరిని మించి ఒకరు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. నిజంగా రాష్ట్ర ప్రయోజనాలపై ఆ పార్టీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే ప్రధాని నరేంద్రమోదీని నిలదీయాలని గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ‘రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై భాజపా నేతలు ఎందుకు మాట్లాడటం లేదు? భాజపా పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు ఏవిధంగా మంజూరు అవుతున్నాయో.. తెలంగాణకు ఎందుకు కావడం లేదో సమాధానం చెప్పాలి. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే తమ ఉనికిని కాపాడుకోగలమని భావించడం సరికాదు. గత భారాస ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు భాజపా నేతలు ఎందుకు ప్రశ్నించలేదు? మెట్రో రైల్ 2వ దశ, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ సహా రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అన్ని పెండింగ్ ప్రాజెక్టులకు కేంద్రం వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలి’ అని పొన్నం డిమాండ్ చేశారు.

## గోదావరిలో కాలుష్యంపై సమగ్ర అధ్యయనం చేయాలి

అమరావతి: గోదావరి నదిని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. కాలువల ద్వారా కలుస్తున్న కాలుష్య కారక వ్యర్థాలపై దృష్టి సారించాలన్నారు. నది ప్రక్షాళనను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామని, ‘స్వచ్ఛ గోదావరి-పవిత్ర పుష్కరాలు’ అనే థీమ్‌తో సమగ్ర కార్యాచరణ కొనసాగుతుందని తెలిపారు. పుష్కరాల నాటికి గోదావరి పవిత్రత ఉట్టిపడేలా, భక్తులు స్వచ్ఛమైన జలాల్లో స్నానం చేసే వాతావరణం కల్పించాలని సూచించారు. రాజమహేంద్రవరం నుంచి అంతర్వేది వరకు గోదావరిలో కలుస్తున్న అన్ని ప్రధాన, ఉప కాలువలపై సమగ్ర అధ్యయనం చేయాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు గురువారం ఆయన ఆదేశాలిచ్చారు. కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి: ప్రతి కాలువలో క్రమం తప్పకుండా నీటి నమూనాలు సేకరించి కాలుష్య స్థాయులను నిర్ధారించాలి. పారిశ్రామిక వ్యర్థాలు నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా శుద్ధవుతున్నాయా, లేదా అనే అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించాలి. వ్యర్థ జలాలు గోదావరిలో కలిసే ముందే శుద్ధి కావాలి. పరిమితికి మించి కాలుష్యాన్ని గుర్తించిన సందర్భాల్లో వెంటనే నియంత్రణ చర్యలు చేపట్టాలి. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలి. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నుంచి విడుదల చేసిన రూ.100 కోట్ల నిధులను సమర్థంగా వినియోగించుకోవాలి. గోదావరి తీరప్రాంత గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే జీరో లిక్విడ్ డిశ్చార్జ్ లక్ష్యంతో చర్యలు ప్రారంభమయ్యాయి. పుష్కరాల నాటికి గ్రామాలను మోడల్ పుష్కర పంచాయతీలుగా తీర్చిదిద్దేలా చర్యలు వేగవంతం చేయాలి.

## వన్యప్రాణుల సంరక్షణలో ఎదురవుతున్న సవాళ్లను గుర్తించండి



అమరావతి: రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకున్న వన్యప్రాణుల మరణాలపై సమగ్ర అధ్యయనం చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అటవీశాఖాధికారులను ఆదేశించారు. పులుల మరణాలపై అధ్యయనానికి అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, అదనపు పీసీసీఎఫ్ రాహుల్ పాండే నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీకి ఈ బాధ్యతలు అప్పగించారు. వన్యప్రాణుల ఆవాసాల నిర్వహణ, రక్షణ చర్యలు, మానవ-వన్యప్రాణి ఘర్షణల నివారణ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న సంరక్షణ కార్యక్రమాల ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని సూచించారు. ‘రాష్ట్రవ్యాప్తంగా వన్యప్రాణుల సంచారం ఉన్న ప్రాంతాలను సందర్శించి వాటి మరణాలకు దారితీస్తున్న అంశాలు, వాటి ఆవాసాల్లోని పరిస్థితులు, వాటి సంచార మార్గాల్లో అమలు చేస్తున్న భద్రత, వేట నిరోధక చర్యలు, పర్యవేక్షణ వ్యవస్థలు, అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణ, నీటి వనరుల లభ్యత తదితర అంశాలను ఉన్నత స్థాయి కమిటీ క్షుణ్ణంగా పరిశీలించాలి. పులులు, చిరుతలు, ఏనుగులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణకు అమలవుతున్న కార్యక్రమాలను సమీక్షించి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సవాళ్లను గుర్తించి నివారణ చర్యలకు సూచనలు చేయాలి. మానవ-వన్యప్రాణి ఘర్షణలు తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలు, విద్యుత్ లైన్లు, రహదారులు, రైల్వే మార్గాలు, ఇతర మౌలిక సదుపాయాల వల్ల ఏర్పడే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిఫార్సులు చేయాలి’ అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ వివరాలను ఉప ముఖ్యమంత్రి కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

## తాతయ్య, నాన్నమ్మ కథలు చెబితే పిల్లలకు

# ఇన్ని ప్రయోజనాలా? సైన్స్ చెబుతున్న 3 విషయాలు



తాతయ్య, నాన్నమ్మల దగ్గర కూర్చొని వాళ్ల చిన్ననాటి కథలు వినడం పిల్లలకు ఓ మధురమైన జ్ఞాపకం. కుటుంబంలో జరిగిన సంఘటనలు, తల్లిదండ్రుల చిన్ననాటి అనుభవాలు, కష్టాలను ఎలా ఎదుర్కొన్నారనే విషయాలు పిల్లల ఆలోచనా విధానంపై కూడా ప్రభావం చూపుతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథలు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడం, భాషా నైపుణ్యాలను మెరుగుపరచడం, ఇతరులతో అనుబంధాన్ని బలోపేతం చేయడంలో ఉపయోగపడతాయి.

1. 'నేను ఎవరు?' అనే భావన బలపడుతుంది

పిల్లలు తమ గురించి తెలుసుకునే క్రమంలో కుటుంబ కథలకు కూడా ప్రాధాన్యం ఉంటుంది. కుటుంబంలో జరిగిన విషయాలను పిల్లలకు పెద్దలు చెప్పినప్పుడు తమ కుటుంబ నేపథ్యం, తమ తల్లిదండ్రుల అనుభవాలు, ఎదుర్కొన్న కష్టాల గురించి పిల్లలకు తెలుస్తుంది. ఉదాహరణకు.. 'మీ అమ్మ కూడా చిన్నప్పుడు స్కూల్‌కి వెళ్లడానికి భయపడేది' అని అమ్మమ్మ చెబితే.. తనకే ఎదురవుతున్న సమస్య కాదని పిల్లలకు అర్థమవుతుంది. ఇలాంటి కథలు కష్టాలను ఎదుర్కొనే ధైర్యాన్ని, నేను అనే ఆత్మవిశ్వాసాన్ని పెంచే అవకాశం ఉంటుంది.

2. భాషా నైపుణ్యాలు

కథలు వినేటప్పుడు పిల్లలు కొత్త పదాలు, వాక్య నిర్మాణాలు, వివరణలు, సంభాషణలు వింటారు. ఒక సంఘటన మొదలై.. దాని తర్వాత ఏం జరిగిందో అర్థం చేసుకోవడానికి వారు శ్రద్ధగా వినాలి. ముఖ్యంగా చిన్న పిల్లల్లో కథలను అర్థం చేసుకునే సామర్థ్యానికి పదజాలం, వ్యాకరణ పరిజ్ఞానం కీలకమని పరిశోధనలు సూచిస్తున్నాయి. తాతయ్య, నాన్నమ్మలు చెప్పే భిన్నమైన కథలు పిల్లలకు కొత్త పదాలు, కొత్త అనుభవాలను పరిచయం చేయగలవు.

3. భావోద్వేగాలను అర్థం చేసుకోవడం

తాతయ్య లేదా నాన్నమ్మ ఒకప్పుడు తాము ఎదుర్కొన్న భయం, నిరాశ, సంతోషం లేదా వైఫల్యం గురించి చెప్పినప్పుడు పిల్లలు కేవలం కథ వినడం మాత్రమే చేయరు. 'అప్పుడు మీకు ఎలా అనిపించింది?', 'తర్వాత ఏం చేశారు?' అంటూ ప్రశ్నలు అడుగుతారు. దీంతో ఇతరుల భావాలను అర్థం చేసుకోవడం, తమ అనుభవాలతో పోల్చుకోవడం వంటి సామాజిక, భావోద్వేగ నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. తాతయ్య, నాన్నమ్మలతో ఏర్పడే ఆప్యాయమైన అనుబంధం కూడా పిల్లల సామాజిక నైపుణ్యాలకు మేలు చేస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి.

అసలు కథలో ఉన్న మ్యాజిక్ ఇదే..

తాతయ్య, నాన్మమ్మ కథలు పిల్లలకు పెద్ద జీవిత పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదు. వాళ్లు చిన్నప్పుడు చేసిన అల్లరి, ఎదుర్కొన్న కష్టం, మొదటి ఉద్యోగం, స్కూల్ అనుభవం.. ఇలా ఏ చిన్న జ్ఞాపకమైనా పిల్లలకు విలువైనదే. అందుకే వాళ్లు కథ చెబుతున్నప్పుడు ఫోన్ పక్కన పెట్టి పిల్లలను కాసేపు విననివ్వండి. ఏళ్ల తర్వాత పిల్లల మనసులో నిలిచిపోయేది పెద్దలు చెప్పిన ఉపదేశం కాకపోవచ్చు.. తమ పక్కనే కూర్చొని తాతయ్య, నాన్నమ్మ చెప్పిన ఆ చిన్న కథే కావచ్చు.

# యూపీలో జడ్జి సంచలనం.. 4 నెలల్లో 22 మందికి మరణశిక్ష!

**యూపీలో ఓ జడ్జి నాలుగు నెలల్లో 22 మందికి ఉరిశిక్ష విధించిన జడ్జి**

**ముజఫర్‌నగర్ అదనపు సెషన్స్ జడ్జి రవికుమార్ దివాకర్ తీర్పులు**

**న్యాయవాది హత్య, దోపిడీ వంటి 10 తీవ్రమైన కేసుల్లో ఈ శిక్షలు ఖరారు**



ఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌కు చెందిన అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కేవలం నాలుగు నెలల కాలంలోనే 10 వేర్వేరు కేసుల్లో 22 మందికి మరణశిక్ష విధించి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. ఈ వరుస తీర్పుల నేపథ్యంలో దేశంలో మరణశిక్షల అమలుపై మరోసారి విస్తృత చర్చ ప్రారంభమైంది. ప్రభుత్వ న్యాయవాది వెల్లడించిన వివరాల ప్రకారం, జడ్జి రవికుమార్ దివాకర్ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో ఈ కీలక తీర్పులను వెలువరించారు. న్యాయవాది సమీర్ సఫీ హత్య కేసు, హోంగార్డు హత్య, హైవే దోపిడీ, ఆర్థిక లాభం కోసం కిడ్నాప్ చేసి హత్య చేయడం వంటి అత్యంత క్రూరమైన నేరాల్లో నిందితులకు ఈ కఠిన శిక్షలు ఖరారు చేశారు. ఇందులో భాగంగా ఏప్రిల్‌లో ఏడుగురికి, మే నెలలో ఒకరికి, జూన్‌లో ఇద్దరికి, జూలైలో ఏడుగురికి, ఆగస్టు 13 నాటికి మరో ఐదుగురికి మరణశిక్ష విధించారు. ఇటీవల ఆగస్టు 12న, 1999 నాటి కిడ్నాప్, హత్య కేసులో షానవాజ్‌కు, ఆగస్టు 13న షామ్లీ జిల్లాలో జరిగిన పవన్ కుమార్ హత్య కేసులో నలుగురికి ఉరిశిక్ష విధిస్తూ ఆయన తీర్పునిచ్చారు. జడ్జి దివాకర్ గతంలో బరేలీలో పనిచేస్తున్న సమయంలోనూ 13 మందికి మరణశిక్ష విధించిన చరిత్ర ఉంది. దీంతో ఆయన ఇప్పటివరకు తన పదవీ కాలంలో మొత్తం 35 మందికి మరణశిక్ష విధించినట్లయింది. 2022లో వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో వీడియోగ్రాఫిక్ సర్వేకు ఆదేశాలు జారీ చేసి జడ్జి రవికుమార్ దివాకర్ దేశవ్యాప్త గుర్తింపు పొందారు. అయితే, సెషన్స్ కోర్టు విధించిన మరణశిక్షలు అమలు కావాలంటే నిబంధనల ప్రకారం హైకోర్టు వాటిని ధ్రువీకరించాల్సి ఉంటుంది. అలాగే, ఈ తీర్పులను సవాలు చేస్తూ నిందితులకు సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునే చట్టపరమైన అవకాశం కూడా ఉంటుంది.

## ఇల్లు, పిల్లల చదువుకే రూ.7 లక్షలు..

# చైనాలో భారతీయ కుటుంబం ఖర్చు వైరల్!

షాంఘైలో నెలకు రూ.9.81 లక్షల ఖర్చు

ఇంటి అద్దెకే నెలకు రూ.3.5 లక్షలు

పిల్లల స్కూల్ ఫీజు రూ.3.5 లక్షలు

కిరాణాకు నెలకు రూ.70,750 ఖర్చు

చైనాలో జీవితం అంటే తక్కువ ఖర్చుతోనే సాగిపోతుందని చాలామంది అనుకుంటారు. కానీ షాంఘైలో ఉంటున్న ఓ భారతీయ కుటుంబం నెలవారీ ఖర్చులు మాత్రం అందుకు భిన్నమైన చిత్రాన్ని చూపిస్తున్నాయి. నలుగురు సభ్యులున్న ఆ కుటుంబం నెలకు దాదాపు రూ. 9.81 లక్షలు ఖర్చు చేస్తోంది. అద్దె, పిల్లల చదువు, కిరాణా, ఇంటి పనివాళ్లు, వినోదం ఇలా పలు ఖర్చులను ఆ కుటుంబానికి చెందిన అదితి శర్మ సోషల్ మీడియాలో వివరించారు. అదితి శర్మ కుటుంబం షాంఘైలోని ఇంటి అద్దెకు నెలకు 25,000 యువాన్లు చెల్లిస్తోంది. మన కరెన్సీలో ఇది దాదాపు రూ. 3.5 లక్షలు. పిల్లలు అంతర్జాతీయ పాఠశాలలో చదువుతున్నారు. వారి చదువుకు కూడా నెలకు మరో 25,000 యువాన్లు, అంటే సుమారు రూ. 3.5 లక్షలు ఖర్చవుతున్నాయి. కుటుంబం నెలవారీ బడ్జెట్‌లో ఎక్కువ భాగం ఈ రెండు ఖర్చులకే వెళ్తోంది. కిరాణా సరుకులకు నెలకు దాదాపు 5,000 యువాన్లు ఖర్చవుతున్నాయి. అంటే సుమారు రూ. 70,750. ఇంటి పనుల కోసం పెట్టుకున్న సిబ్బందికి నెలకు రూ.లక్షకుపైగా చెల్లిస్తున్నారు. విద్యుత్, నీరు, ఇతర యుటిలిటీ ఖర్చులకు సుమారు రూ. 21,230 వెచ్చిస్తున్నారు. ప్రజా రవాణాకు మరో రూ. 10 వేల వరకు ఖర్చవుతోంది. పిల్లల వినోదం, అదనపు కార్యక్రమాల కోసం నెలకు మరో 1,500 యువాన్లు ఖర్చు చేస్తున్నారు. బయట తినడం, షాపింగ్‌కు సుమారు 4,000 యువాన్లు, అంటే రూ. 56,650 వరకు వెచ్చిస్తున్నారు. ఇలా అన్ని ఖర్చులు కలిపితే నెలకు దాదాపు రూ. 9,81,860 అవుతున్నాయని అదితి తెలిపారు. అయితే ఈ మొత్తాన్ని షాంఘైలో ప్రతి కుటుంబానికి వర్తించే ఖర్చుగా చూడొద్దని ఆమె స్పష్టం చేశారు. తమ జీవనశైలి, పిల్లలు చదివే స్కూల్, ఉండే ప్రాంతం, ఇంటి అద్దె ఆధారంగా ఖర్చులు మారుతాయని చెప్పారు. తమకు ఎలాంటి ప్రవాస భత్యం రావడం లేదని, వైద్య బీమా మాత్రం 100 శాతం వైద్య ఖర్చులను కవర్ చేస్తుందని తెలిపారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పలువురు స్పందించారు. షాంఘై, బీజింగ్ వంటి పెద్ద నగరాల్లో అద్దెలు, అంతర్జాతీయ పాఠశాలల ఫీజులు భారీగా ఉంటాయని కొందరు పేర్కొన్నారు. చైనాలోని చిన్న నగరాలతో పోలిస్తే ఈ నగరాల్లో జీవన వ్యయం చాలా ఎక్కువగా ఉంటుందని మరికొందరు తెలిపారు.

# ఏపీలో సుజ్లాన్ భారీ విస్తరణ.. రూ.10 వేల కోట్ల పెట్టుబడులు

రాయదుర్గంలో సుజ్లాన్ కొత్త బ్లేడ్ ఉత్పత్తి లైన్‌కు రేపు శ్రీకారం

రూ.10 వేల కోట్లతో 1325 మెగావాట్ల విండ్ ప్రాజెక్టుల ఏర్పాటు

కొత్త ప్రాజెక్టుల ద్వారా 4 వేల మందికి ఉపాధి అవకాశాలు

2030 నాటికి ఏపీలో 5 వేల మెగావాట్ల ప్రాజెక్టుల స్థాపన లక్ష్యం




పవన విద్యుత్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సుజ్లాన్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను భారీగా విస్తరిస్తోంది. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలో రూ. 10,000 కోట్ల పెట్టుబడితో కొత్త విండ్ ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ా144 కొత్త బ్లేడ్ ఉత్పత్తి లైన్‌ను రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం ప్రారంభించనున్నారు. రాయదుర్గం నియోజకవర్గం, కణేకల్లు మండలం హులికెర గ్రామంలో ఈ కొత్త యూనిట్‌ను ఏర్పాటు చేశారు. సుజ్లాన్ చేపట్టనున్న 1325 మెగావాట్ల సామర్థ్యం గల ఈ విండ్ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 4,000 మందికి ఉపాధి లభించనుంది. రేపు (ఆగస్టు 25) మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ఈ బ్లేడ్ ఉత్పత్తి లైన్ అధికారికంగా ప్రారంభం కానుంది. ఆంధ్రప్రదేశ్‌లో సుజ్లాన్ సంస్థకు ఇప్పటికే బలమైన పునాదులు ఉన్నాయి. 2004లో రాష్ట్రంలో కార్యకలాపాలు మొదలుపెట్టిన ఈ సంస్థ, ప్రస్తుతం 1700 మెగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యంతో ఏపీలో అతిపెద్ద విండ్ భాగస్వామిగా కొనసాగుతోంది. అనంతపురం జిల్లాలోనే ఇప్పటివరకు రూ. 12 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టి, 2,200 మందికి ఉద్యోగాలు కల్పించింది. ఉరవకొండ నియోజకవర్గంలోని ఇప్పూరులో రోటర్ బ్లేడ్ తయారీ యూనిట్‌ను కూడా నిర్వహిస్తోంది. భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా, 2030 నాటికి రాష్ట్రంలో అదనంగా 5,000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను స్థాపించాలని సుజ్లాన్ లక్ష్యంగా పెట్టుకుంది. కేవలం పరిశ్రమలకే పరిమితం కాకుండా, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి గ్రీన్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తోంది. ఉరవకొండ, విజయవాడలలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాల ద్వారా 12,000 మంది యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తోంది. వీరిలో 25 శాతం మహిళలు ఉండటం గమనార్హం. దేశీయ పవన విద్యుత్ మార్కెట్‌లో సుజ్లాన్ దాదాపు 33 శాతం వాటాను కలిగి ఉంది. దేశంలో స్థాపితమైన ప్రతి మూడు విండ్ టర్బైన్లలో ఒకటి సుజ్లాన్ తయారీ కావడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా 20 గిగావాట్ల పవన విద్యుత్ స్థాపన మైలురాయిని దాటిన తొలి భారతీయ కంపెనీగా కూడా సుజ్లాన్ రికార్డు సృష్టించింది. ఈ తాజా ప్రాజెక్టులతో ఆంధ్రప్రదేశ్ పవన విద్యుత్ రంగంలో సుజ్లాన్ తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోనుంది.

# 2026లో సోషల్ మీడియా ఇలా మారిపోతోంది.. మీరు చూస్తున్నదంతా మునుపటిలా ఉండదు!

పర్ఫెక్ట్ కంటే సహజమైన కంటెంట్‌కు ఆదరణ

చిన్న క్రియేటర్లకూ వైరల్ అయ్యే అవకాశం

సోషల్ మీడియాలోనే సమాచారం వెతుకుతున్న యూజర్లు

ఏఐ కంటే హ్యూమన్ టచ్‌కు పెరుగుతున్న విలువ

షాపింగ్ నిర్ణయాలపై సోషల్ మీడియా ప్రభావం




సోషల్ మీడియా ప్రతి ఏడాది కొత్తగా మారుతోంది. ఒకప్పుడు అందమైన ఫొటోలు, ట్రెండింగ్ పాటలు, భారీ ఫాలోయింగ్ ఉన్న సెలబ్రిటీలే ఎక్కువగా కనిపించేవారు. ఇప్పుడు పరిస్థితి క్రమంగా మారుతోంది. సాధారణంగా తీసిన వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి. లక్షలాది మంది ఫాలోవర్లు లేకపోయినా చిన్న క్రియేటర్లు పెద్ద ఆడియన్స్‌ను సంపాదించుకుంటున్నారు. అంతేకాదు.. సోషల్ మీడియా ఇప్పుడు కేవలం టైమ్‌పాస్ కోసం చూసే వేదికగా కాకుండా సమాచారం వెతకడానికి, వస్తువులు కొనడానికి, కొత్త ప్రదేశాలు తెలుసుకోవడానికి కూడా ఉపయోగపడుతోంది. 2026లో సోషల్ మీడియాను మార్చుతున్న ఐదు ముఖ్యమైన ట్రెండ్స్ ఇవే.

రియల్ లైఫ్‌కు ప్రాధాన్యం

ప్రతి ఫొటోను పర్ఫెక్ట్‌గా చూపించాలనే ఆలోచన క్రమంగా తగ్గుతోంది. కొంచెం బ్లర్‌గా ఉన్న ఫొటో, ఒక్క టేక్‌లో తీసిన వీడియో, సహజంగా మాట్లాడిన మాటలు కూడా ఇప్పుడు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. మరీ ఎక్కువగా ప్లాన్ చేసిన కంటెంట్ కంటే నిజ జీవితానికి దగ్గరగా కనిపించే పోస్టులకు ఆదరణ పెరుగుతోంది. క్రియేటర్లు తమ జీవితంలోని చిన్న చిన్న లోపాలను కూడా చూపిస్తున్నారు. అంటే సోషల్ మీడియాలో 'పర్ఫెక్ట్ లైఫ్' కంటే 'రియల్ లైఫ్'కు ప్రాధాన్యం పెరుగుతోంది.

లక్షల ఫాలోవర్లు లేకపోయినా..

గతంలో సోషల్ మీడియాలో గుర్తింపు రావాలంటే భారీ ఫాలోయింగ్ ఉండాలి. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. రికమెండేషన్ ఆధారిత ఫీడ్స్ వల్ల చిన్న క్రియేటర్లు కూడా ఒక్క పోస్టుతో వేలాది మందికి చేరుతున్నారు. ఇప్పటికే ఫేమస్ అయిన వ్యక్తుల కంటే కొత్తగా వచ్చినవారికీ వైరల్ అయ్యే అవకాశం పెరిగింది. కొన్నిసార్లు రోజుల తరబడి కష్టపడి తయారు చేసిన వీడియో కంటే సరదాగా తీసిన చిన్న క్లిప్ ఎక్కువగా వైరల్ అవుతోంది.

సోషల్ మీడియాలోనే సమాధానాలు!

రెస్టారెంట్ ఎలా ఉంది? ఏ హోటల్ బాగుంటుంది? ఏ స్కిన్‌కేర్ ప్రొడక్ట్ కొనాలి? జైపూర్‌లో రెండు రోజుల్లో ఏం చూడాలి? ఇలాంటి ప్రశ్నలకు ఇప్పుడు చాలామంది సోషల్ మీడియాలోనే సమాధానాలు వెతుకుతున్నారు. ముఖ్యంగా వీడియోల ద్వారా నిజమైన అనుభవాలు తెలుసుకోవడం ప్రజలకు ఆసక్తిగా మారింది. ఒక రెస్టారెంట్ పేరు తెలుసుకోవడం మాత్రమే కాదు.. అక్కడి వాతావరణం, ఫుడ్, ధరలు ఎలా ఉన్నాయో కూడా వీడియోల్లో చూసి నిర్ణయం తీసుకుంటున్నారు. దీంతో సోషల్ మీడియా క్రమంగా సెర్చ్ ఇంజిన్‌లా మారుతోంది.

ఏఐ కంటెంట్ పెరిగే కొద్దీ..

ఏఐతో ఫొటోలు, వీడియోలు, క్యాప్షన్లు, స్క్రిప్టులు క్షణాల్లో తయారవుతున్నాయి. దీంతో కంటెంట్ తయారు చేయడం చాలా సులభమైంది. కానీ అందరూ ఒకే రకమైన ఏఐ టూల్స్ ఉపయోగిస్తుండటంతో కేవలం అందంగా కనిపించే కంటెంట్ ప్రేక్షకులను ఎక్కువగా ఆకట్టుకోకపోవచ్చు. వ్యక్తిగత అనుభవం, ప్రత్యేకమైన హాస్యం, సహజమైన మాటతీరు, చిన్న చిన్న పొరపాట్లు కంటెంట్‌కు ప్రత్యేకతను ఇస్తున్నాయి. ఏఐ పోస్టును తయారు చేయగలదు.. కానీ దానిపై ఆసక్తి కలిగించే వ్యక్తిత్వాన్ని మాత్రం ఇవ్వలేదు.

### సోషల్ మీడియా నుంచి షాపింగ్ వరకు..

సోషల్ మీడియాలో చూసిన వస్తువును కొనడం ఇప్పుడు చాలా సాధారణంగా మారుతోంది. ఒకరు వేసుకున్న షూస్ నచ్చితే అవి ఎక్కడ దొరుకుతాయో తెలుసుకుంటున్నారు. ఒక మేకప్ ప్రొడక్ట్ లేదా గ్యాడ్జెట్ ఎలా పనిచేస్తుందో క్రియేటర్ వీడియోలో చూసి కొనుగోలు చేస్తున్నారు. అందుకే క్రియేటర్లు ఇప్పుడు వినోదం అందించడంతో పాటు కొనుగోలు నిర్ణయాలపై కూడా ప్రభావం చూపుతున్నారు. అయితే ప్రతి సిఫార్సు నిజాయతీగా ఉంటుందని భావించకూడదు. వినోదం, ప్రచారం, షాపింగ్.. ఈ మూడింటి మధ్య ఉన్న గీతలు మరింత చెరిగిపోతున్నాయి.

# మోదీ-ట్రంప్ భేటీలో ప్రశ్నలొద్దని కోరిన భారత్

మోదీ పక్కనే ఉండగా.. ట్రంప్ చేసిన ఆ ఒక్క పని.. అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు

తొలుత భారత అభ్యర్థనకు అంగీకరించిన ట్రంప్

భేటీ తర్వాత ఆ విషయం మర్చిపోయిన అమెరికా అధ్యక్షుడు

భేటీ తర్వాత మీడియా నుంచి ప్రశ్నలు ఆహ్వానించిన ట్రంప్

ఈ విషయాన్ని వెల్లడించిన అమెరికా రాయబారి సెర్జియో గోర్



పారిస్ సమీపంలో జరిగిన మోదీ-ట్రంప్ భేటీ ప్రశ్నల పర్వంగా మారడం వెనుక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మీడియా ఉండొచ్చు కానీ ప్రశ్నలు అడగకూడదని భారత్ కోరిందట. దీనికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలుత అంగీకరించారట. అయితే సమావేశం ప్రారంభమైన తర్వాత ఆ విషయం మర్చిపోయి స్వయంగా మీడియాను ప్రశ్నలకు ఆహ్వానించారని అమెరికా రాయబారి సెర్జియో గోర్ వెల్లడించారు.

భారత్ పెట్టిన ఒక్క అభ్యర్థన

ఫ్రాన్స్‌లో జూన్ 17న జీ7 సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, ట్రంప్ సమావేశమయ్యారు. భేటీకి ముందు అమెరికా విదేశాంగ ప్రతినిధితో భారత విదేశాంగ శాఖ ఓ అభ్యర్థన చేసిందని గోర్ తెలిపారు. మీడియాను అనుమతించవచ్చు కానీ పూర్తి స్థాయి ప్రెస్ కాన్ఫరెన్స్ వద్దన్నదే ఆ అభ్యర్థన అని చెప్పారు. ఈ విషయాన్ని ట్రంప్‌నకు చెప్పగా.. ఎలాంటి ఇబ్బంది లేదని ఆయన అంగీకరించారని గోర్ తెలిపారు.

'ఎనీ క్వశ్చన్స్?'తో మారిన సీన్

సమావేశం ప్రారంభమైంది. దాదాపు 50 కెమెరాల మధ్య మోదీ, ట్రంప్ తమ ప్రారంభ ప్రసంగాలు చేశారు. ఆ తర్వాత ట్రంప్ ఒక్కసారిగా మీడియా వైపు తిరిగి.. "ఏమైనా ప్రశ్నలు ఉన్నాయా?" అని అడిగారని గోర్ చెప్పారు.

అంతే.. అనుకున్న పరిమిత మీడియా కార్యక్రమం పూర్తి స్థాయి ప్రెస్ కాన్ఫరెన్స్‌గా మారిపోయింది. దాదాపు 45 నిమిషాల పాటు ప్రశ్నల పరంపర సాగిందని తెలిపారు. సమావేశంలోని పలు అంశాలు చర్చకు వచ్చాయని చెప్పారు.

### సముద్ర భద్రతపై మోదీ ప్రస్తావన

ఈ భేటీకి ముందు హార్మూజ్ జలసంధిలో అమెరికా నౌకాదళ దాడిలో ముగ్గురు భారత నావికులు మరణించారు. దీంతో అక్కడ పనిచేస్తున్న భారతీయ నావికుల భద్రత అంశాన్ని ట్రంప్ దృష్టికి మోదీ తీసుకెళ్లారు. హార్మూజ్ ప్రాంత పరిస్థితులు, భారత్-అమెరికా వాణిజ్య సంబంధాలపైనా ఇద్దరు నేతలు చర్చించారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు సాగుతున్న సమయంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. రెండు దేశాలు ఒప్పందానికి చాలా దగ్గరగా వచ్చాయని ట్రంప్ వ్యాఖ్యానించారు.

# ఆరోగ్యం, ఆదాయం.. భారత అవకాడోలకు పెరుగుతున్న ఆదరణ.. రైతులకు సిరులు!

**భారత అవకాడోలకు ఆదరణ పెరుగుతోందన్న ప్రధాని మోదీ**

**రైతుల ఆదాయం పెంచడంలో ఈ పండు పాత్రపై ప్రశంస**

**మన్ కీ బాత్ కార్యక్రమంలో ఏపీ రైతు విజయగాథ ప్రస్తావన**

**ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలు ఈ పండులో పుష్కలం**

**పట్టణాల డిమాండ్‌తో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం**



భారత్‌లో పండిస్తున్న అవకాడో పండ్లకు మార్కెట్లో ఆదరణ బాగా పెరుగుతోందని, ఇది రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పోషక విలువలతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తున్న ఈ పండు ప్రాముఖ్యతను ఆయన తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆగస్టు 30న ప్రసారమైన తన 137వ 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో, ఆ తర్వాత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియోలో ప్రధాని ఈ విషయాలను ప్రస్తావించారు. ఒకప్పుడు భారతదేశంలో పెద్దగా పరిచయం లేని, తక్కువ డిమాండ్ ఉన్న ఈ పండు, ఇప్పుడు ఆరోగ్య స్పృహ ఉన్నవారి డైనింగ్ టేబుళ్లపై, ప్రీమియం మార్కెట్లలో సాధారణంగా కనిపిస్తోందని ఆయన వివరించారు. అవకాడోలు రోజువారీ ఆహారానికి కొత్త రుచిని జోడించడంతో పాటు, రైతుల ఆదాయాన్ని కూడా గణనీయంగా పెంచుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని పలువురు రైతుల విజయగాథలను పంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాకు చెందిన రైతు వరదరాజ్, చాలాకాలంగా టమాటా, అరటి పండించేవారు. తన స్నేహితుడి పొలంలో అవకాడో చెట్లను చూసి, ఆన్‌లైన్‌లో దాని గురించి పరిశోధన చేసి ఈ సాగును ప్రారంభించారు. ప్రస్తుతం ఆయన ఏటా నాలుగు టన్నుల దిగుబడి సాధిస్తూ స్థానిక దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. అదేవిధంగా, తమిళనాడులోని కొడైకెనాల్‌కు చెందిన చంద్రశేఖరన్, అర హెక్టారులో అవకాడోలను పండించి మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. కర్ణాటకలోని చిక్కమగళూరు రైతులు కాఫీ, మిరియాల తోటలలో అంతరపంటగా అవకాడోలను సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. ప్రస్తుతం భారత్‌లో అవకాడో సాగు ప్రధానంగా తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలతో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో కేంద్రీకృతమై ఉంది. ఉష్ణమండల, ఉప ఉష్ణమండల వాతావరణం దీనికి అనుకూలంగా ఉంటుంది. అయితే, మంచును ఈ పంట తట్టుకోలేదు.

**ఆరోగ్య ప్రయోజనాలు అనేకం**

పోషకాహార నిపుణుల ప్రకారం అవకాడోలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మోనోఅన్‌శాచురేటెడ్ ఫ్యాట్స్ (ఆలివ్ నూనెలో ఉండేవి), ఫైబర్, పొటాషియం, ఫోలేట్, మెగ్నీషియం, విటమిన్ కె, ఇ వంటివి ఇందులో పుష్కలంగా ఉంటాయి. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. రోజుకు సగం నుంచి ఒక మధ్యస్థ అవకాడోను మించకుండా పచ్చిగానే తినడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తంమీద ఒకప్పుడు దిగుమతి చేసుకునే ప్రత్యేక పండుగా ఉన్న అవకాడో, ఇప్పుడు దేశీయంగా పండుతూ పట్టణాల డిమాండ్‌ను అందుకోవడమే కాకుండా, గ్రామీణ రైతుల ఆదాయాన్ని పెంచుతోందన్న ప్రధాని వ్యాఖ్యలు ఈ మార్పును స్పష్టం చేస్తున్నాయి.

# ఉదయాన్నే వెన్న తింటే బరువు తగ్గుతారా? నిపుణులు చెబుతోంది ఇదే..!

**వైట్ బటర్‌తో నేరుగా బరువు తగ్గరని నిపుణుల సూచన**

**కొంతసేపు ఆకలి తగ్గించొచ్చని వివరణ**

**వెన్నలో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయని వెల్లడి**

**అధికంగా తింటే ఎల్‌డీఎల్ పెరగొచ్చని హెచ్చరిక**

**కొలెస్ట్రాల్ ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని సూచన**



ఉదయం లేవగానే ఖాళీ కడుపుతో ఓ చెంచా ఉప్పు లేని తాజా వెన్న (వైట్ బటర్).. ఈ మధ్య సోషల్ మీడియాలో కనిపిస్తున్న ఆరోగ్య చిట్కాల్లో ఒకటి. బరువు తగ్గాలనుకునేవారికి ఇది మేలు చేస్తుందని కొందరు చెబుతున్నారు. ఎక్కువసేపు ఆకలి వేయకుండా చేస్తుందని ప్రచారం జరుగుతోంది. మరికొందరు మాత్రం వెన్నలో కొవ్వు ఎక్కువగా ఉంటుంది కాబట్టి కొలెస్ట్రాల్ పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు. ఇంతకీ ఈ రెండింటిలో నిజం ఏది?



**ఆకలి తగ్గొచ్చా?**

వైట్ బటర్‌లో కొవ్వు అధికంగా ఉంటుంది. దీన్ని తినడం వల్ల జీర్ణక్రియ కొంత నెమ్మదిగా సాగవచ్చు. దీంతో కడుపు నిండిన భావన ఎక్కువసేపు ఉండొచ్చు. ఫలితంగా మధ్యలో ఎక్కువగా తినాలనే కోరిక తగ్గే అవకాశం ఉంది. ఈ కారణంగా బరువు నియంత్రణకు పరోక్షంగా ఉపయోగపడొచ్చు. అయితే వెన్న తినడం వల్ల శరీరంలోని కొవ్వు నేరుగా కరిగిపోతుందని మాత్రం చెప్పలేం.



**వెయిట్ లాస్‌కు అసలు లెక్క ఇదే**

బరువు తగ్గాలంటే రోజులో తీసుకునే క్యాలరీల కంటే ఖర్చయ్యే కేలరీలు ఎక్కువగా ఉండాలి. వైట్ బటర్‌లో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. అందుకే మోతాదుకు మించి తీసుకుంటే బరువు తగ్గడం కష్టమవుతుంది. పైగా ఇతర కొవ్వు పదార్థాలతో కలిపి ఎక్కువగా తీసుకుంటే క్యాలరీల మోతాదు మరింత పెరుగుతుంది. కాబట్టి వైట్ బటర్‌ను బరువు తగ్గించే ఆహారంగా చూడటం సరైంది కాదని నిపుణులు వివరిస్తున్నారు.

**కొలెస్ట్రాల్ సంగతేంటి?**

వైట్ బటర్‌లో సంతృప్త కొవ్వులు (శాచురేటెడ్ ఫ్యాట్స్) ఉంటాయి. ఎక్కువగా తీసుకుంటే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇప్పటికే కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. ఊబకాయం ఉన్నవారు, గుండె జబ్బుల ముప్పు ఉన్నవారు కూడా మోతాదును నియంత్రించాలి.

**ఎవరైనా తినొచ్చా?**

వైట్ బటర్‌లో కొవ్వులో కరిగే కొన్ని విటమిన్లు ఉంటాయి. శరీరానికి శక్తిని అందించడంలోనూ ఇది ఉపయోగపడుతుంది. అయితే ప్రతి ఒక్కరికీ ఒకే మోతాదు సరిపోదు. కొలెస్ట్రాల్ లేదా గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు వైద్యులు లేదా డైటీషియన్ సలహా తీసుకోవడం మంచిది.

**ఎలా తీసుకుంటే మంచిది?**

వైట్ బటర్‌ను తక్కువ మోతాదులో తీసుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. సంపూర్ణ ధాన్యాలతో చేసిన రొట్టె, ప్రొటీన్ ఉన్న అల్పాహారం లేదా చిరుధాన్యాల ఆహారంతో కలిపి తీసుకోవడం మంచిది. ప్రాసెస్ చేసిన ఆహారాలతో పాటు ఎక్కువ మొత్తంలో తినకపోవడం అవసరం. మొత్తంగా చూస్తే.. ఖాళీ కడుపుతో వైట్ బటర్ తినడం వల్లే బరువు తగ్గుతామని చెప్పడానికి బలమైన ఆధారాలు లేవు. మితంగా తీసుకుంటే ఆహారంలో భాగంగా ఉండొచ్చు. మోతాదు పెరిగితే మాత్రం క్యాలరీలు, కొలెస్ట్రాల్ రెండూ సమస్యగా మారొచ్చు.

## షుగర్ ఫ్రీ అంటూ లాగిస్తున్నారా? గుండెపోటు, స్ట్రోక్‌తో లింక్..

# తాజా స్టడీలో సంచలన విషయాలు!



**స్వీట్‌నర్ జైలిటాల్‌పై ఆందోళన కలిగిస్తున్న కొత్త అధ్యయనం**

**ఇది గుండెపోటు, స్ట్రోక్ ముప్పుతో ముడిపడినట్లు గుర్తింపు**

**జైలిటాల్ రక్తం గడ్డకట్టే అవకాశాన్ని పెంచొచ్చన్న పరిశోధకులు**

**అధ్యయనంలో 17,710 మంది డేటా విశ్లేషణ**

**షుగర్ ఫ్రీ ఉత్పత్తుల్లో జైలిటాల్ విస్తృత ఉపయోగం**

చక్కెర లేని గమ్.. మింట్స్.. బేకరీ పదార్థాలు.. టూత్‌పేస్ట్.. వీటిలో కనిపించే ఓ స్వీట్‌నర్‌పై ఇప్పుడు ఆందోళన మొదలైంది. తక్కువ కేలరీలు ఉంటాయని విస్తృతంగా వాడుతున్న జైలిటాల్ కు గుండెపోటు, స్ట్రోక్ వంటి తీవ్రమైన గుండె సంబంధిత సమస్యల ముప్పుతో సంబంధం ఉన్నట్లు కొత్త అధ్యయనం సూచించింది. జర్మనీలో జరిగిన యూరోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ (ఈఎస్‌సీ) కాంగ్రెస్‌లో ఈ పరిశోధన వివరాలను వెల్లడించారు. జైలిటాల్ రక్తంలోని ప్లేట్‌లెట్లు సులభంగా గడ్డకట్టేలా చేయొచ్చని పరిశోధకులు గుర్తించారు. దీనివల్ల గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారిలో ముప్పు పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. జైలిటాల్ సహజంగానే కొన్ని పండ్లు, కూరగాయల్లో స్వల్పంగా ఉంటుంది. మన శరీరం కూడా జీవక్రియలో భాగంగా కొద్దిమొత్తంలో దీన్ని తయారు చేస్తుంది. అయితే పరిశ్రమల్లో పెద్ద మొత్తంలో తయారు చేసి పలు ఆహార ఉత్పత్తుల్లో స్వీట్‌నర్‌గా కలుపుతున్నారు. చక్కెరతో పోలిస్తే ఇందులో దాదాపు 40 శాతం తక్కువ కేలరీలు ఉంటాయి. రక్తంలో చక్కెర స్థాయులను కూడా పెద్దగా పెంచదు. దీంతో షుగర్ ఫ్రీ ఉత్పత్తుల్లో దీని వాడకం పెరిగింది. కెనడా, యూరప్‌లో నిర్వహించిన రెండు దీర్ఘకాలిక అధ్యయనాల నుంచి 17,710 మంది వివరాలను పరిశోధకులు విశ్లేషించారు. గతంలో అధిక ప్రమాదం ఉన్న వ్యక్తుల్లో రక్తంలో జైలిటాల్ స్థాయులు గుండె సంబంధిత సమస్యలతో ముడిపడి ఉన్నట్లు గుర్తించామని బెర్లిన్‌లోని చారిటే యూనివర్సిటీ ఆసుపత్రికి చెందిన డాక్టర్ మార్కో విట్కోవ్‌స్కీ తెలిపారు. అయితే జైలిటాల్ నేరుగా గుండెపోటు లేదా స్ట్రోక్‌కు కారణమవుతుందని ఈ పరిశోధన నిరూపించలేదని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ప్రస్తుత ఫలితాలు బలమైన సంబంధాన్ని మాత్రమే చూపుతున్నాయని చెప్పారు. ఉత్పత్తుల్లో జైలిటాల్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో దీని దీర్ఘకాలిక ప్రభావాలపై మరిన్ని పరిశోధనలు అవసరమని పేర్కొన్నారు.

## సప్లిమెంట్లు వద్దు.. ఈ సహజ ఆహారాలతోనే సంపూర్ణ ఆరోగ్యం!



- **సప్లిమెంట్ల కన్నా సహజ ఆహారంతోనే పోషకాలు సులభంగా అందుతాయంటున్న నిపుణులు**
- **జాతీయ పోషకాహార వారోత్సవం సందర్భంగా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన**
- **ఐరన్ కోసం మునగాకు-బీట్‌రూట్, కాల్షియం కోసం రాగి-నువ్వుల మిశ్రమం ఉత్తమం**
- **విటమిన్ సి కోసం ఉసిరి, మల్టీవిటమిన్ల కోసం మిశ్రమ విత్తనాలు మేలని సూచన**

**వైద్యుల సలహా లేకుండా సప్లిమెంట్లు వాడటం ప్రమాదకరమని హెచ్చరిక**

సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు దేశవ్యాప్తంగా జాతీయ పోషకాహార వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్య నిపుణులు కీలకమైన అంశాన్ని నొక్కి చెబుతున్నారు. కృత్రిమంగా తయారుచేసిన సప్లిమెంట్లపై ఆధారపడటం కంటే పోషకాలు అధికంగా ఉండే సహజమైన ఆహార పదార్థాల ద్వారానే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని వారు స్పష్టం చేస్తున్నారు. రోజూవారీ అవసరాలకు అవసరమైన పోషకాలను సహజ ఆహారం ద్వారానే సమర్థవంతంగా పొందవచ్చని సూచిస్తున్నారు.

సప్లిమెంట్లపై ఆధారపడటాన్ని తగ్గించి, మనకు అందుబాటులో ఉండే ఐదు రకాల ఆహార పదార్థాలతో పోషకాహార లోపాన్ని ఎలా అధిగమించవచ్చో నిపుణులు వివరించారు.

1. ఐరన్ కోసం: ఐరన్ టాబ్లెట్లు వాడటం వల్ల చాలామందిలో గ్యాస్, మలబద్ధకం వంటి జీర్ణ సంబంధిత సమస్యలు వస్తుంటాయి. దీనికి బదులుగా తాజా మునగాకు, పచ్చి బీట్‌రూట్ మిశ్రమానికి కొద్దిగా నిమ్మరసం కలిపి తీసుకోవాలి. మునగాకు, బీట్‌రూట్‌లోని ఐరన్‌ను శరీరం సులభంగా గ్రహించడానికి నిమ్మరసంలోని విటమిన్ సి ఎంతగానో సహాయపడుతుంది.

2. కాల్షియం కోసం: ఎముకల ఆరోగ్యానికి కాల్షియం అత్యవసరం. దీనికోసం నువ్వులు, రాగులను ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిలో శరీరం సులభంగా గ్రహించగలిగే కాల్షియంతో పాటు మెగ్నీషియం, ఫాస్ఫరస్, జింక్ వంటివి కూడా లభిస్తాయి. అధిక మోతాదులో కాల్షియం సప్లిమెంట్లు వాడటం వల్ల కలిగే దుష్ప్రభావాలను దీని ద్వారా నివారించవచ్చు.

3. విటమిన్ సి కోసం: విటమిన్ సి కోసం మార్కెట్లో దొరికే మాత్రలకు బదులుగా తాజా ఉసిరికాయ లేదా బాగా పండిన జామపండు తినడం ఉత్తమం. ఒక చిన్న ఉసిరికాయలో అధిక స్థాయిలో సహజ విటమిన్ సి ఉంటుంది. దీనిలోని ఫ్లేవనాయిడ్లు, టానిన్లు జీర్ణక్రియ సమయంలో విటమిన్ సి నష్టపోకుండా కాపాడతాయి.

4. మల్టీవిటమిన్ల కోసం: రకరకాల మల్టీవిటమిన్ టాబ్లెట్లు వాడే బదులు, గుప్పెడు మిశ్రమ విత్తనాలు తీసుకోవడం ఎంతో మేలు. గుమ్మడి గింజలు, పొద్దుతిరుగుడు విత్తనాలు, అవిసె గింజల మిశ్రమం ద్వారా సహజమైన విటమిన్ ఇ, జింక్, మెగ్నీషియం, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు సమతుల్య రూపంలో శరీరానికి అందుతాయి.

5. ప్రొబయోటిక్స్ కోసం: పేగుల ఆరోగ్యానికి మేలు చేసే ప్రొబయోటిక్స్ కోసం సంప్రదాయ పద్ధతుల్లో పులియబెట్టిన ఆహారాలు అద్భుతంగా పనిచేస్తాయి. ఇంట్లో తయారుచేసిన పెరుగు, చద్దన్నం, నల్ల క్యారెట్ కంజి వంటివి తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థకు మేలు చేసే ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా లభిస్తుంది. అయితే, వైద్య పరీక్షల్లో పోషకాహార లోపాలు ఉన్నట్లు నిర్ధారణ అయినప్పుడు, గర్భధారణ సమయంలో లేదా కొన్ని ప్రత్యేక ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు వైద్యులు సూచించిన సప్లిమెంట్లు వాడటం తప్పనిసరి అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సాధారణ ఆరోగ్య పరిరక్షణకు మాత్రం రంగురంగుల సహజమైన, సంపూర్ణ ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వడమే స్థిరమైన మార్గమని వారు సలహా ఇస్తున్నారు. ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఆహారపు అలవాట్లలో పెద్ద మార్పులు చేసుకునే ముందు తప్పనిసరిగా వైద్యులను లేదా డైటీషియన్‌ను సంప్రదించాలని సూచిస్తున్నారు.

## వంటింటిపై ధరల పిడుగు..

### ఆకాశాన్నంటిన ఉల్లి, అల్లం, వెల్లుల్లి

సామాన్యుడి వంటింట్లో ధరల మంట

నెల రోజుల్లోనే రెట్టింపు స్థాయికి చేరిన ఉల్లి ధర

వినియోగదారుడి జేబుకు చిల్లు

రైతుకు గిట్టుబాటుతో ఆనందం

వర్షాభావంతో భారీగా పడిపోయిన దిగుబడులు

కొత్త పంట వచ్చేవరకు ధరలు తగ్గవంటున్న అధికారులు



సామాన్యుడి వంటింట్లో ధరల మంట రాజుకుంది. నిత్యావసరాలైన ఉల్లి, అల్లం, వెల్లుల్లి ధరలు ఆకాశాన్నంటుతూ నెలవారీ బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. ముఖ్యంగా ఉల్లి ధర నెల రోజుల వ్యవధిలోనే రెట్టింపు కావడంతో వినియోగదారులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. అయితే, ఈ ధరల పెరుగుదల రైతులకు మాత్రం ఊరటనిస్తోంది. హైదరాబాద్ మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో నెల క్రితం క్వింటాల్ రూ. 2,000 ఉన్న మహారాష్ట్ర ఉల్లి ధర, ఇప్పుడు ఏకంగా రూ. 5,000 మార్కును తాకింది. ఏడాది కాలంలో ఇదే గరిష్ఠ ధర అని వ్యాపారులు చెబుతున్నారు. ఉల్లి బాటలోనే అల్లం, వెల్లుల్లి కూడా పయనిస్తున్నాయి. కర్ణాటక నుంచి వచ్చిన అల్లం క్వింటాల్ రూ. 16,000 పలుకుతుండగా, మధ్యప్రదేశ్ నుంచి దిగుమతి అయిన వెల్లుల్లి ధర క్వింటాల్‌కు రూ. 19,000గా నమోదైంది. దీంతో బహిరంగ మార్కెట్‌లో కిలో వెల్లుల్లి ధర రూ. 250 దాటిపోయింది. ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణం వర్షాభావ పరిస్థితులతో దిగుబడులు తగ్గడమేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మహారాష్ట్రలో గత జూన్, జులై నెలల్లో కురిసిన భారీ వర్షాలకు పంట దెబ్బతింది. మరోవైపు, కర్ణాటక, కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక ఉల్లి సాగు గణనీయంగా పడిపోయింది. ఫలితంగా, రోజుకు 20 వేల క్వింటాళ్లు రావాల్సిన మలక్‌పేట మార్కెట్‌కు ప్రస్తుతం కేవలం 5 వేల క్వింటాళ్ల ఉల్లి మాత్రమే వస్తోంది. ధరల పెరుగుదల వినియోగదారులకు భారంగా మారినప్పటికీ, రైతులకు మాత్రం ఆనందాన్నిస్తోంది. గతంలో గిట్టుబాటు ధర లేక పంటను రోడ్లపై పారబోసిన రైతులు, ఇప్పుడు మంచి ధర దక్కుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో కొత్త పంట మార్కెట్‌కు వచ్చే వరకు ధరలు తగ్గకపోవచ్చని, ఈ భారం తప్పదని వ్యాపారులు చెబుతున్నారు.

## ఇంటి కొనుగోలుదారులకు భారీ ఊరట..

### బ్రోచర్‌లోని హామీలు నెరవేర్చాల్సిందేనన్న సుప్రీంకోర్టు

డీఎల్ఎఫ్ గురుగ్రామ్ ప్రాజెక్టు వివాదంపై కీలక వ్యాఖ్యలు

బ్రోచర్‌లో చూపిన 24 మీటర్ల రోడ్డును నిర్మించకపోవడాన్ని తప్పుబట్టిన న్యాయస్థానం

ఇది చిన్న మార్పు కాదని, చాలా కీలకమైనదని కోర్టు అభిప్రాయం

హామీ మేరకు ప్రాజెక్టును మార్చకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



ఢిల్లీ: రియల్ ఎస్టేట్ డెవలపర్లకు సుప్రీంకోర్టు హెచ్చరిక జారీ చేసింది. ప్రాజెక్టుల బ్రోచర్లలో, ప్రచార సామగ్రిలో ఇచ్చే హామీలను కేవలం మార్కెటింగ్ జిమ్మిక్కులుగా చూడటానికి వీల్లేదని, కొనుగోలుదారులకు చెప్పిన ప్రతి అంశాన్ని కచ్చితంగా నెరవేర్చాలని స్పష్టం చేసింది. గురుగ్రామ్‌లోని సెక్టార్ 82ఏలో డీఎల్ఎఫ్ హోమ్ డెవలపర్స్ నిర్మించిన 'ది ప్రైమస్' రెసిడెన్షియల్ ప్రాజెక్టుకు సంబంధించిన వివాదంలో ఈ తీర్పు వెలువడింది. ప్రాజెక్టు బ్రోచర్‌లో చూపిన 24 మీటర్ల వెడల్పున్న రోడ్డును వాగ్దానం చేసినట్లు నిర్మించకపోవడమే ఈ వివాదానికి మూలకారణం. ఈ మార్పు చిన్నది కాదని, చాలా కీలకమైనదని జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. కోర్టు ఆదేశాల మేరకు జరిగిన సీబీఐ ప్రాథమిక విచారణలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. సుమారు 147 మీటర్ల పొడవున ఉండాల్సిన రోడ్డులో 52 మీటర్ల భాగాన్ని గ్రీన్ ప్యాచ్‌గా మార్చారు. మరో భాగాన్ని నివాసితులు, సందర్శకుల వాహనాల పార్కింగ్ కోసం వాడుతున్నారు. అంటే, బ్రోచర్‌లో చూపిన విధంగా రోడ్డు దాదాపుగా లేనట్లేనని నివేదిక తేల్చింది. బ్రోచర్లలోని హామీలను చూసే ప్రజలు ఫ్లాట్లు కొంటారని, వాటికి అనుగుణంగానే ప్రాజెక్టులను నిర్మించి అందించాలని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణలోగా బ్రోచర్‌లో చెప్పినట్లుగా ప్రాజెక్టులో మార్పులు చేయకపోతే తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని డీఎల్ఎఫ్‌ను హెచ్చరించింది. 2012లో ఈ ప్రాజెక్టును ప్రారంభించగా, పలువురు కొనుగోలుదారులు ముందుగా జాతీయ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఆ తర్వాత ఇరు పక్షాలు సుప్రీంకోర్టుకు వెళ్లాయి. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు కొనసాగుతోందని, తదుపరి విచారణను అక్టోబర్ 12, 2026కి వాయిదా వేస్తున్నట్లు కోర్టు తెలిపింది.

## జైశంకర్‌తో భేటీ.. భారత్‌కు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు!

జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ

యుద్ధం ముగింపుపై ప్రధానంగా చర్చ

భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన జెలెన్‌స్కీ

బ్లాక్ సీ పరిస్థితిపైనా చర్చ

శాంతి ప్రక్రియలో భారత్ పాత్రపై ఉక్రెయిన్ ఆశలు

ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. భారత్-ఉక్రెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు భారత్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జైశంకర్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ 'ఎక్స్'లో స్పందించారు. "ఈ అన్యాయమైన యుద్ధానికి ముగింపు పలకాలన్న భారత ఆకాంక్షకు కృతజ్ఞతలు. యుద్ధం ఆపి శాంతిని పునరుద్ధరించాలన్నదే భారత స్పష్టమైన వైఖరి" అని పేర్కొన్నారు. నల్ల సముద్రం ప్రాంతంలో పరిస్థితులు, పౌర నౌకాయానానికి ఎదురవుతున్న ముప్పుపైనా చర్చించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఆహారం అవసరమైన ప్రాంతాలకు సరఫరాలు అడ్డుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. తమ నౌకాశ్రయాలు, ధాన్యం కారిడార్, సరఫరాలను అడ్డుకోవడం ప్రపంచ సంబంధాల్లో తీవ్ర అంతరాయాలకు కారణమవుతోందని ఆరోపించారు. జైశంకర్ కూడా జెలెన్‌స్కీతో భేటీ వివరాలను 'ఎక్స్'లో వెల్లడించారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహాతో జరిగిన చర్చలను జెలెన్‌స్కీకి వివరించినట్లు చెప్పారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంతో పాటు యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి సిబిహాతో జైశంకర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. యుద్ధం ముగింపు, బ్లాక్ సీ భద్రత, నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ ఆహార భద్రత అంశాలపై చర్చించారు. శాంతి ప్రక్రియలో భారత్ మరింత చురుకైన పాత్ర పోషించాలని ఉక్రెయిన్ కోరింది. భారత్-ఉక్రెయిన్ మధ్య వాణిజ్యం ప్రస్తుతం 2.6 బిలియన్ డాలర్లుగా ఉందని సిబిహా తెలిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, పునర్నిర్మాణంలో భారత కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని ఉక్రెయిన్ భావిస్తోంది. ఇంధనం, మౌలిక వసతులు, రవాణా, వ్యవసాయం, ఔషధాలు, డిజిటలైజేషన్, ఇంజినీరింగ్ రంగాల్లో సహకారానికి అవకాశాలున్నాయని చెప్పారు. జైశంకర్ ఉక్రెయిన్ పర్యటన మరో విషయంలోనూ ప్రత్యేకంగా నిలిచింది. భారత విదేశాంగ మంత్రి ఉక్రెయిన్‌కు స్వతంత్ర ద్వైపాక్షిక పర్యటన చేయడం ఇదే తొలిసారి.

# నేపాల్ వరద విలయం

## వందలాది చిన్నారుల గల్లంతు.. కష్టంగానే ఆచూకీ!

నేపాల్-చైనా సరిహద్దులో ఘోర వరద విపత్తు

వందలాది చిన్నారులు సహా 5,000 మందికి పైగా గల్లంతు

ధ్వంసమైన నెట్‌వర్క్‌లతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం

17,000 మంది పిల్లలకు తక్షణ సహాయం అవసరమన్న యూనిసెఫ్

మృతుల సంఖ్య 1,200 దాటడంతో కొనసాగుతున్న సహాయక చర్యలు



నేపాల్‌లో సంభవించిన ఘోర వరద విపత్తు పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ జల ప్రళయంలో వందలాది మంది చిన్నారులు సహా వేలాది మంది గల్లంతయ్యారు. కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, రోడ్లు, వంతెనలు పూర్తిగా ధ్వంసం కావడంతో గల్లంతైన వారిని, ముఖ్యంగా పిల్లలను గుర్తించడం అధికారులకు కష్టసాధ్యంగా మారింది. వారి ఆచూకీ తెలియక కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనతో ఎదురుచూస్తున్నారు.

ఆగస్టు 26న నేపాల్-చైనా (టిబెట్) సరిహద్దులోని హిమాలయాల్లో భారీ హిమానీనదం కూలిపోవడంతో త్రిశూలి నదికి వరదలు పోటెత్తాయి. ఈ ఆకస్మిక వరదల ధాటికి చైనా-నేపాల్ సరిహద్దులోని గైరాంగ్ చెక్‌పాయింట్ సహా పలు పట్టణాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం, నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 1,200 దాటింది. నేపాల్, టిబెట్ కలిపి గల్లంతైన వారి సంఖ్య 4,000 నుంచి 5,000 మధ్య ఉంటుందని అంచనా. గల్లంతైన వారిలో భారతీయులు, అమెరికన్లతో పాటు పలువురు విదేశీయులు కూడా ఉన్నారు.

ఈ విపత్తులో చిన్నారులు తీవ్రంగా ప్రభావితమయ్యారు. యూనిసెఫ్ ప్రకారం, సుమారు 17,000 మంది పిల్లలకు తక్షణ మానవతా సహాయం అవసరం. వరదల కారణంగా 18 పాఠశాలలు పూర్తిగా నేలమట్టం కాగా, మరో 20 పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం, సుమారు 230 నుంచి 250 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు గల్లంతయ్యారు. కుటుంబాల నుంచి విడిపోయిన పిల్లల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. యూనిసెఫ్ బృందాలు వారిని గుర్తించి, కుటుంబ సభ్యులతో కలిపేందుకు, మానసిక సహాయం అందించేందుకు కృషి చేస్తున్నాయి.

గల్లంతైన వారిని కనుగొనడంలో 'తెగిపోయిన నెట్‌వర్క్‌లు' అతిపెద్ద సవాలుగా మారాయి. టెలిఫోన్, ఇంటర్నెట్ సేవలు పూర్తిగా స్తంభించాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో చాలా ప్రాంతాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. కేవలం హెలికాప్టర్ల ద్వారా మాత్రమే సహాయక బృందాలు అక్కడికి చేరుకోగలుగుతున్నాయి. దీంతో సహాయక చర్యలు, మృతదేహాల గుర్తింపు ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. డీఎన్ఏ నమూనాలు సేకరించి మృతులను గుర్తించేందుకు నేపాల్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఐక్యరాజ్యసమితి, రెడ్‌క్రాస్ వంటి అంతర్జాతీయ సంస్థలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి.

## జీతం లేని పనిలో భారతీయులే టాప్..

### వారానికి 16 గంటలకు పైగా వెట్టిచాకిరి.. నివేదికలో షాకింగ్ నిజాలు!

జీతం లేని పని గంటల విషయంలో భారతీయులు ప్రపంచంలోనే మొదటి స్థానం

ప్రతి నలుగురు భారత ఉద్యోగుల్లో ఒకరు వారానికి 16 గంటలకు పైగా ఉచితంగా పనిచేస్తున్న వైనం

ఎక్కువ గంటలు పనిచేస్తున్నా ఉత్పాదకత పెరగడం లేదని తేల్చిన అధ్యయనం

రిమోట్ వర్క్ చేసే ఉద్యోగులు, యువతలోనే ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోందని వెల్లడి

పనిభారం, ఒత్తిడి కారణంగా ఉద్యోగాలు మానేయాలని చాలామంది ఆలోచిస్తున్నట్లు స్పష్టీకరణ






పని విషయంలో భారతీయులు ఎంతో కష్టపడతారని పేరుంది. అయితే ఈ కష్టంలో అధిక భాగం జీతం లేకుండానే జరుగుతోందని తాజా అధ్యయనం ఒకటి సంచలన విషయాలను వెల్లడించింది. ఏడీపీ సంస్థ విడుదల చేసిన 'పీపుల్ ఎట్ వర్క్ 2026' నివేదిక ప్రకారం, ప్రపంచంలోనే అత్యధికంగా జీతం లేని పని గంటలు నమోదు చేస్తున్న దేశంగా భారత్ నిలిచింది. వారానికి 16 గంటలకు పైగా ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా పనిచేస్తున్న ఉద్యోగులు మన దేశంలోనే ఎక్కువగా ఉన్నారని ఈ రిపోర్ట్ స్పష్టం చేసింది.

భారత్‌లో ప్రతి నలుగురు ఉద్యోగుల్లో ఒకరు (24శాతం) వారానికి 16 లేదా అంతకంటే ఎక్కువ గంటలు ఉచితంగా పనిచేస్తున్నట్లు ఈ అధ్యయనంలో తేలింది. మరో 40శాతం మంది ఉద్యోగులు వారానికి 6 నుంచి 15 గంటల పాటు జీతం లేని అదనపు పని చేస్తున్నారు. అంటే, మన దేశంలోని అధిక శాతం శ్రామిక శక్తి గణనీయమైన సమయాన్ని ఎలాంటి వేతనం లేకుండానే పనికి కేటాయిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఈ పరిస్థితి భిన్నంగా ఉంది. అంతర్జాతీయంగా కేవలం 12 శాతం మంది మాత్రమే వారానికి 16 గంటలకు పైగా అదనపు పని చేస్తున్నారు.

అయితే, ఎక్కువ గంటలు పనిచేస్తే ఎక్కువ ఫలితాలు వస్తాయనుకుంటే పొరపాటేనని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. అదనపు పనిభారం మోస్తున్న ఉద్యోగులు తాము అనుకున్నంత ఉత్పాదకతను చూపలేకపోతున్నామని అంగీకరించారు. ఇలాంటి వారిలో తీవ్రమైన ఒత్తిడి, ఉద్యోగం మారాలనే ఆలోచనలు కూడా అధికంగా ఉన్నట్లు తేలింది. జీతం లేని పని గంటలు ఎక్కువగా ఉన్నవారు తమ ఉద్యోగంలో నిబద్ధత, సంతృప్తిని పొందుతున్నామని చెబుతున్నప్పటికీ, వారిలో ఉత్పాదకత తక్కువగా ఉండటం, మానసిక శ్రేయస్సు తగ్గడం, కొత్త ఉద్యోగం కోసం వెతికే ధోరణి పెరగడం వంటివి గమనించారు.

ముఖ్యంగా ఇంటి నుంచి పనిచేసే (రిమోట్) ఉద్యోగులు, యువతలోనే ఈ అదనపు పని గంటల ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది. ఆఫీసుకు వచ్చి పనిచేసే వారితో పోలిస్తే రిమోట్ వర్కర్లే ఎక్కువ గంటలు ఉచితంగా పనిచేస్తున్నట్లు నివేదిక పేర్కొంది. ఈ గణాంకాలు కంపెనీలకు ఒక హెచ్చరికగా నిలుస్తున్నాయి. ఉద్యోగుల పనితీరును కేవలం హాజరు లేదా లాగిన్ అయిన గంటలతో అంచనా వేయడం సరికాదని నిపుణులు సూచిస్తున్నారు. జీతం లేని పని గంటలు పెరిగేకొద్దీ అది ఉద్యోగుల ఉత్పాదకత, వారి శ్రేయస్సుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, చివరికి వారు కంపెనీని వీడిపోయేందుకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు.

## ఇరాన్‌పై ఉచ్చు బిగిస్తున్న అమెరికా..

### 2027 వరకు బలగాల మోహరింపు పొడిగింపు!

ఇరాన్‌పై వ్యూహంలో భాగంగా 50,000 మంది సైనికులు, 19 యుద్ధ నౌకల మోహరింపు

సైనికుల సేవా కాలం పొడిగింపుతో వారిపై పెరుగుతున్న తీవ్ర ఒత్తిడి

సైనిక చర్యలతో పాటు ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే అమెరికా లక్ష్యం

ఎప్పుడైనా దాడికి సిద్ధమంటూ ఇరాన్‌కు ట్రంప్ బహిరంగ హెచ్చరిక



పశ్చిమాసియాలో ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాంతంలో మోహరించిన తమ సైనిక బలగాల గడువును 2027 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు యుద్ధ విషయంలో మరిన్ని ప్రత్యామ్నాయాలు ఇచ్చేందుకు ఉద్దేశించిన దీర్ఘకాలిక సైనిక వ్యూహంలో భాగమని 'వాల్ స్ట్రీట్ జర్నల్' తన కథనంలో వెల్లడించింది. ఇరాన్‌పై సైనిక చర్యలు, ఆర్థిక ఒత్తిడి, అవసరమైతే విస్తృత స్థాయి యుద్ధం వంటి అంశాలను ట్రంప్ పరిశీలనలో ఉంచడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

మొదట ఇరాన్‌పై స్వల్పకాలిక, నిర్ణయాత్మక సైనిక చర్యగా ప్రచారం చేసినప్పటికీ, ఇప్పుడు ఈ మోహరింపు భారీగా విస్తరించింది. ప్రస్తుతం పశ్చిమాసియాలో సుమారు 50,000 మంది అమెరికా సైనికులు, 19 యుద్ధ నౌకలు, ఫైటర్ స్క్వాడ్రన్లు, వాయు రక్షణ విభాగాలు, పారాట్రూపర్లు మోహరించి ఉన్నారు. ఈ సుదీర్ఘ మోహరింపు కారణంగా అమెరికా సైనికులు, వారి కుటుంబాలు, సైనిక పరికరాలపై తీవ్ర భారం పడుతోందని 'వాల్ స్ట్రీట్ జర్నల్' పేర్కొంది. ఆర్మీ ఎయిర్ డిఫెండర్ల సేవా కాలాన్ని 9 నెలల నుంచి 12 నెలలకు పెంచారు. యూరప్, పసిఫిక్ ప్రాంతాల నుంచి వచ్చిన కొన్ని యూనిట్లు ఏడాదికి పైగా అక్కడే విధులు నిర్వర్తిస్తున్నాయి. నౌకాదళం కూడా ఇదే విధమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ప్రస్తుతం రెండు విమానవాహక నౌకలు, 13 గైడెడ్-మిసైల్ డిస్ట్రాయర్లతో సహా మొత్తం 19 యుద్ధ నౌకలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. యుద్ధం ప్రారంభంలో పంపిన యూఎస్ఎస్ డెల్బర్ట్ డి. బ్లాక్, యూఎస్ఎస్ స్ప్రూయన్స్ వంటి నౌకలు, వాటిలోని 300 మంది సిబ్బంది నెలల తరబడి విరామం లేకుండా సముద్రంలోనే గడుపుతున్నారు. అదే సమయంలో ట్రంప్ యంత్రాంగం ఇరాన్‌పై తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి ప్రయోగించడం ద్వారా ఆ దేశ నాయకత్వాన్ని తిరిగి చర్చల టేబుల్‌పైకి తీసుకురావాలని వ్యూహరచన చేస్తోంది. ఆర్థిక ఒత్తిడితోనే ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని నిలిపివేస్తుందని, అందుకే ఈ యుద్ధాన్ని ముగిసినట్లుగా ప్రకటించడంపై ట్రంప్ తన సీనియర్ సహాయకులతో చర్చిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై ట్రంప్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "హర్మూజ్ జలసంధిపై మాకు పూర్తి నియంత్రణ ఉంది. వాళ్ల ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోంది. ఇరాన్ ప్రజలు ఎప్పుడు తిరుగుబాటు చేస్తారు?" అని రాశారు.

బుధవారం ఆయన మాట్లాడుతూ.. "ఎప్పుడైనా, ఎక్కడైనా దాడులు చేసేందుకు అమెరికా పూర్తి సన్నద్ధంగా ఉంది. మేము వారి రాడార్ వ్యవస్థను ధ్వంసం చేశాం. వాళ్లు ఏం చేస్తున్నారో మాకు అన్నీ తెలుసు. వాళ్లు బాత్రూమ్‌కు వెళ్లినా మేము చూడగలం" అని వ్యాఖ్యానించారు. రాబోయే నవంబర్ మధ్యంతర ఎన్నికలపై ఈ యుద్ధం ప్రతికూల ప్రభావం చూపుతుందని ట్రంప్ సహాయకులు ఆందోళన చెందుతున్నప్పటికీ, ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని తాను నిర్ణయాలు తీసుకోవడం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. సైనిక చర్యలతో పాటు ఇరాన్ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా దెబ్బతీసి, ఆ దేశ వాణిజ్య భాగస్వాములపై ఆంక్షలు విధించడం ద్వారా ఇరాన్‌ను లొంగదీసుకోవాలన్నది అమెరికా వ్యూహంగా కనిపిస్తోంది.

# నిధి అగర్వాల్ కొత్త సినిమా.. ఈసారి ఏకంగా మైథలాజికల్ థ్రిల్లర్!



**వరాహ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న సినిమా**
**నిధి పుట్టినరోజున ప్రారంభమైన చిత్రీకరణ**
**సినిమాకు శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం**
**హీరోయిన్ ప్రధానంగా సాగే కథ**

హీరోయిన్ నిధి అగర్వాల్ కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈసారి ఆమె ఓ విభిన్న కథతో అలరించనున్నట్లు తెలుస్తోంది. నిధి తదుపరి చిత్రం మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుందని సినీ వర్గాల సమాచారం. హీరోయిన్ ప్రధానంగా సాగే ఈ కథలో ఆమె ఇప్పటివరకు చేయని పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. వరాహ ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా ఆ సంస్థకు తొలి ప్రొడక్షన్. సునీత్ పడోల్కర్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'తంత్ర' ఫేమ్ శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహిస్తున్నాడు. నిధి పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాను పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. అదే రోజు చిత్రీకరణ కూడా మొదలైంది. సినిమా ప్రారంభోత్సవంలో పి. అశోక్, పి. రేణుక తొలి షాట్‌కు కెమెరా స్విచాన్ చేశారు.



నిధి అగర్వాల్ చిత్రబృందంతో కలిసి కార్యక్రమంలో పాల్గొంది. ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్', పవన్ కళ్యాణ్ నటించిన 'హరి హర వీర మల్లు' చిత్రాల్లో నిధి నటనకు మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు మరో ఆసక్తికరమైన కథతో ఆమె ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

సినిమా ప్రారంభం సందర్భంగా మేకర్స్ నిధి ఫస్ట్‌లుక్‌ను కూడా విడుదల చేశారు. అందులో ఆమె ఒక చేతిలో దీపం పట్టుకుని.. మరో చేతితో దానికి రక్షణగా నిలిచినట్లు కనిపిస్తోంది. వెనుక భాగంలో అనేక చేతులతో ఉన్న దేవత ఆకారం కనిపిస్తోంది. ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి హీరోయిన్ చుట్టూ తిరిగేలా బలమైన కథను సిద్ధం చేసినట్లు సమాచారం. త్వరలోనే సినిమా టైటిల్‌ను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.



# 'సలార్ 2'పై బిగ్ అప్డేట్.. అదే టైమ్‌లో రిలీజ్ కన్‌ఫర్మ్!






ఇండియాన్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ప్రభాస్, మాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'సలార్ 2: శౌర్యాంగపర్వం'. మొదటి భాగం 'సలార్: పార్ట్ 1 - సీజ్‌ఫైర్' థియేటర్లలో తెచ్చిన తుఫాన్ ఎలాంటిదో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఈ సీక్వెల్ షూటింగ్ రిలీజ్ కి సంబంధించి, ఒక సాలిడ్ అప్డేట్ బయటకు వచ్చింది. ఈ వార్తతో ప్రభాస్ అభిమానుల్లో ఒక్కసారిగా పండగ వాతావరణం నెలకొంది. మరి ఆ అప్డేట్ పైన మనము ఓ లుక్ వేద్దాం.. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఉన్న 'సలార్ 2' షూటింగ్ ఇప్పటికే కొంత భాగం పూర్తయింది. మిగతా చిత్రీకరణను వచ్చే ఏడాదిలోనే అంటే 2027లో పూర్తి చేయాలని మేకర్స్ గట్టిగా డిసైడ్ అయ్యారు. ఇక ఖాన్సార్ సామ్రాజ్యంలో దేవ, వరదరాజ మన్నార్ ల మధ్య రాబోయే అసలైన యుద్ధం కోసం ఫ్యాన్స్ ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ తాజా క్లారిటీతో సినిమాపై మరింత హైప్ పెరిగింది. ఎన్టీఆర్ సినిమాతో ప్రశాంత్ నీల్ బిజీ: ప్రస్తుతం దర్శకుడు ప్రశాంత్ నీల్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో కలసి 'డ్రాగన్' సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతుండగా, 2027 ప్రారంభం నాటికే దీన్ని పూర్తి చేయాలని నీల్ ప్లాన్ చేస్తున్నారు. ఆ సినిమా పనులు ముగియగానే ప్రశాంత్ నీల్ తన దృష్టినంతా పూర్తిగా 'సలార్ 2' పైనే పెట్టనున్నారు. వరుస ప్రాజెక్టులతో ప్రభాస్ హడావిడి: మరోవైపు ప్రభాస్ కూడా తన చేతిలో ఉన్న ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసే పనిలో ఉన్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'ఫౌజీ' చిత్రం ముగింపు దశకు చేరుకుంది. అలాగే 'స్పిరిట్', 'కల్కి 2' చిత్రాల షూటింగ్‌లు కూడా రీసెంట్‌గానే మొదలయ్యాయి. ప్రశాంత్ నీల్ వచ్చేలోగా ప్రభాస్ తన 'ఫౌజీ', 'స్పిరిట్' షూటింగ్స్ ఒక కొలిక్కి తీసుకురానున్నారు.

# 25వ సినిమా.. చైతూ ఏ లెక్కలో వెళ్తాడో!



నాగచైతన్య కెరీర్ ఇప్పుడు 25వ సినిమా దగ్గరకు వచ్చేసింది. మైల్‌స్టోన్ నంబర్ కావడంతో సహజంగానే ఫ్యాన్స్‌లో కాస్త ఎక్కువ అంచనాలు ఉంటాయి. అయితే అంతకంటే ముందు చైతూ చేస్తున్న వృషకర్మ కూడా చిన్న సినిమా కాదు. తండేల్ తో ఇప్పటికే వంద కోట్ల క్లబ్ చూసిన చైతూ, ఇప్పుడు తన కెరీర్‌లోనే పెద్ద కాన్వాస్‌లో కనిపించే సినిమాతో ముందుకు వస్తున్నాడు. విరూపాక్షతో తొలి సినిమాకే వంద కోట్ల రేంజ్ చూసిన కార్తీక్ దండు వృషకర్మను తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటివరకు బయటకు వచ్చిన కంటెంట్‌లో మిస్టరీ, అడ్వెంచర్, గ్రాఫిక్స్‌కు మంచి స్పేస్ కనిపిస్తోంది. చైతూ కూడా ఇంతకుముందు చేయని ప్రపంచంలోకి వెళ్లాడు. సినిమా కంటెంట్ క్లిక్ అయితే తండేల్ తర్వాత ఆయన మార్కెట్‌ను మరో మెట్టు ఎక్కించే అవకాశం దీనికి ఉంది. అందుకే వృషకర్మ తర్వాత వచ్చే 25వ సినిమా మీద ఫ్యాన్స్ లెక్క కూడా కాస్త వేరుగా ఉంటుంది. మైల్‌స్టోన్ కాబట్టి భారీ బడ్జెట్ ఉండాలనే రూల్ ఏమీ లేదు. కానీ ముందు సినిమా విజువల్‌గా పెద్ద స్థాయిలో ఉండి, బాక్సాఫీస్ దగ్గర కూడా మంచి రిజల్ట్ ఇస్తే తర్వాత వచ్చే సినిమాకు అంచనాలు ఆటోమేటిక్‌గా పెరుగుతాయి. అప్పుడు 25వ సినిమా కోసం చైతూ ఎలాంటి కథ ఎంచుకుంటాడన్నదే ఎక్కువ ఆసక్తి పెంచుతుంది. ఇక్కడే వెంకీ అట్లూరి పేరు వినిపిస్తోంది. నాగవంశీ నిర్మాణంలో చైతూ 25వ సినిమాను వెంకీ డైరెక్ట్ చేసే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇంకా అధికారికంగా ఏమీ ఫిక్స్ కాలేదు. కానీ ఈ కాంబినేషన్ నిజమైతే ఫ్యాన్స్ లో అంచనాలు మళ్ళీ మరోలా పెరుగుతాయి. వృషకర్మ తరహా భారీ అడ్వెంచర్ తర్వాత వెంకీ అదే రూట్‌లో వెళతాడా అనేది అసలు డౌట్

# రాశి ఖన్నా స్టన్నింగ్ లుక్స్.. సోషల్ మీడియాలో క్రేజీ ఫొటోలు



టాలీవుడ్ అందాల భామ రాశి ఖన్నా సరికొత్త గ్లామరస్ ఫొటోషూట్‌తో సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఆమె అద్భుతమైన అందాలు, స్టైలిష్ లుక్స్ అభిమానులను కట్టిపడేస్తున్నాయి. వింటేజ్, వింటర్-చిక్ శైలిలో ఆమె పంచుకున్న ఈ లేటెస్ట్ పిక్స్ ప్రస్తుతం నెట్టంట విపరీతంగా వైరల్ అవుతున్నాయి. రాశి ఖన్నా గ్లామర్, ఆమె ఫ్యాషన్ సెన్స్ చూసి నెటిజన్లు లైకులు, కామెంట్ల వర్షం కురిపిస్తూ ఈ ఫొటోలను తెగ ట్రెండ్ చేస్తున్నారు. 5 అదిరిపోయే డ్రెస్సింగ్ స్టైల్ : ఈ లేటెస్ట్ ఫొటోషూట్‌లో రాశి ఖన్నా ధరించిన దుస్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భుజాలపై నుండి జారిపడేలా డిజైన్ చేసిన ఎరుపు రంగు శాలువాను టాప్‌లా స్టైల్ చేయగా, దానికి మ్యాచింగ్‌గా హై-వేస్ట్ బ్లాక్ అండ్ వైట్ ప్లీటెడ్ చెకర్డ్ మిడ్డీ స్కర్ట్ ధరించారు. ఇక ఈ కలర్ కాంబినేషన్ ఆమెకు వింటాజ్ లుక్‌తో పాటు రాయల్ ఎలిగెన్స్ తెచ్చిపెట్టింది. అలరిస్తున్న మేకప్, హెయిర్ స్టైల్: సాఫ్ట్ వేవీ హెయిర్, వార్మ్ బ్రాంజ్ మేకప్, ఫ్లష్ నూడ్ లిప్‌స్టిక్‌తో రాశి చాలా క్లాసీగా కనిపిస్తున్నారు. కెమెరా వైపు ఆమె చూస్తున్న తీరు, చూపులతోనే మాయ చేసేలా ఉంది. ఇక సౌత్ నుంచి నార్త్ వరకు అన్ని భాషల ప్రేక్షకులను తన నటనతో, అందంతో మెప్పిస్తున్న రాశి ఖన్నా, ఫ్యాషన్ విషయంలో ఎప్పటికప్పుడు కొత్త ప్రయోగాలు చేస్తూ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటున్నారు. చేతినిండా క్రేజీ ప్రాజెక్టులు: ప్రస్తుతం రాశి ఖన్నా కెరీర్ ఫుల్ స్వింగ్‌లో ఉంది. బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్‌లలో ఆమె వరుసగా పెద్ద సినిమాల్లో నటిస్తున్నారు. రాశి ఖన్నా తమిళంలో 'అగత్య', తెలుగులో 'తెలుసు కదా' అలాగే వార్ డ్రామా '120 బహదూర్' సినిమాల్లో నటించి మెప్పించారు. పవన్ కళ్యాణ్‌తో కలిసి 'ఉస్తాద్ భగత్ సింగ్'లో కూడా నటించారు. ఇక రజనీకాంత్‌తో 'ధర్మన్' మూవీలో నటిస్తూ భారీ ప్రాజెక్టులను తన ఖాతాలో వేసుకున్నారు. గతంలో షాహిద్ కపూర్, విజయ్ సేతుపతిలతో కలిసి నటించి మంచి విజయం సాధించిన 'ఫర్జీ' సిరీస్‌కు సీక్వెల్‌గా రాబోతున్న 'ఫర్జీ 2' షూటింగ్‌లో తాజాగా ఆమె పాల్గొంటున్నారు. ఇందులో ఆమె 'మేఘా వ్యాస్' అనే పాత్రలో మరోసారి మెప్పించనున్నారు. ఈ విషయాన్ని రాశి స్వయంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఇటీవల వెల్లడించడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు గ్లామరస్ ఫొటోషూట్‌లతో కుర్రకారు గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తూ, మరోవైపు వైవిధ్యమైన సినిమాలతో దూసుకుపోతున్న రాశి ఖన్నా, రాబోయే



# డిలే భారాన్ని సంక్రాంతి మోయగలదా

సాయి దుర్గా తేజ్ నటిస్తున్న 'సంబరాల ఏటిగట్టు' సినిమాను ఇంకా ఎంత కాలం సాగదీస్తారు అనే టాక్ అయితే ఉంది. మొదట్లో ఈ మూవీని 2025 సెప్టెంబర్ 25న రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. ఆ డేట్ వర్కౌట్ కాలేదు. ఆ తర్వాత ఈ ఏడాది జూన్ లో ఒక అప్డేట్ ఇస్తూ 2026 డిసెంబర్ లో థియేటర్లలోకి తీసుకొస్తామని చెప్పారు. కట్ చేస్తే ఇప్పుడు ఏకంగా 2027 జనవరి 12కి వాయిదా వేశారు. ఫైనల్ గా సినిమాను సంక్రాంతి బరిలో దించుతున్నారు. పండగ సీజన్ దొరకడం పెద్ద ప్లస్ పాయింట్ అయినా, ఇన్నాళ్ల డిలేని సంక్రాంతి అడ్వాంటేజ్ ఒక్కటే బ్యాలెన్స్ చేయగలదా అనే డౌట్ వస్తుంది. వచ్చే ఏడాది సంక్రాంతి రేసు ఇప్పటికే టైట్ అయిపోయింది. జనవరి 8న మహాకాళి థియేటర్లలోకి వస్తుంటే, శర్వానంద్ శ్రీను వైట్ల కాంబోలో తెరకెక్కిన జార్జ్ క్రిష్ జనవరి 14న రాబోతోంది. నాగార్జున కూడా సడన్ సర్ ప్రైజ్ ఇవ్వచ్చు. వీటికి తోడు వెంకటేష్ కళ్యాణ్ రామ్ లతో అనిల్ రావిపూడి చేస్తున్న మల్టీస్టారర్ సినిమా కూడా పండగనే టార్గెట్ చేసింది.




రిలీజ్ టైమ్ కి వీటిలో ఎన్ని సినిమాలు రేసులో నిలబడతాయో ఇప్పుడే చెప్పలేం కానీ, బాక్సాఫీస్ దగ్గర మాత్రం గట్టి ఫైట్ తప్పదనే విషయం క్లియర్ గా తెలుస్తోంది. సంబరాల ఏటిగట్టు టీమ్ కు ఉన్న అసలు సమస్య రిలీజ్ డేట్ ఒక్కటే కాదు. ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్, క్యారెక్టర్ పోస్టర్లు ఎప్పుడో బయటకు వచ్చేశాయి. మధ్యలో ఇలా పదే పదే రిలీజ్ వాయిదా పడుతూ వస్తుంటే జనాల్లో ఆటోమేటిక్ గా ఆసక్తి తగ్గిపోతుంది. జనవరి వచ్చేసరికి ఇది ఎప్పటినుంచో నానుతున్న సినిమా అనే ఫీలింగ్ రాకుండా చూసుకోవాలి. ఇప్పుడే చూడాల్సిన ఫ్రెష్ మూవీ అనే వైబ్స్ క్రియేట్ చేయాలి. దానికి తగ్గట్టుగానే మేకర్స్ ప్రమోషనల్ కంటెంట్ ను చాలా కొత్తగా డిజైన్ చేసుకోవాల్సిన అవసరం ఉంది. పండగ సీజన్ అనగానే బిజినెస్ పరంగా రేట్లు పెంచి అమ్ముకునే ఆస్కారం ఉంటుంది. అయితే ఇప్పటికే చాలా డిలే అయిన ప్రాజెక్ట్ కావడంతో, సంక్రాంతి పేరు చెప్పి థియేట్రికల్ టార్గెట్ ను అమాంతం పెంచేస్తే అసలుకే మోసం వస్తుంది. ఒకేసారి ఐదారు సినిమాలు థియేటర్లలో ఉన్నప్పుడు కచ్చితంగా స్క్రీన్స్ పంచుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. అలాంటప్పుడు సినిమా టాక్ కాస్త అటూ ఇటూగా ఉన్నా కలెక్షన్స్ రికవర్ చేసుకోవడానికి టైమ్ దొరకదు. కాబట్టి రేట్ల విషయంలో మేకర్స్ జాగ్రత్తగా అడుగులు వేయాలి. వరుస సెలవులు ఉండటం, ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు క్యూ కట్టడం వల్ల మంచి టాక్ వస్తే రెండో రోజు నుంచే కలెక్షన్స్ పికప్ అవుతాయి. ఈ సినిమా కోసం సాయి దుర్గా తేజ్ తన లుక్, ఫిజిక్ ను పూర్తిగా మార్చేశాడు. ఐశ్వర్య లక్ష్మి, జగపతి బాబు, శ్రీకాంత్, సాయికుమార్ లాంటి స్ట్రాంగ్ కాస్టింగ్ కూడా ఈ ప్రాజెక్ట్ లో ఉంది. కాబట్టి సినిమాలో కంటెంట్ పరంగా కావాల్సినంత స్టఫ్ ఉందనే చెప్పాలి.



# న్యూయార్క్‌లో 'ఇండియా డే పరేడ్'.. చీఫ్ గెస్ట్‌గా మెరిసిన పూజా హెగ్డే!




అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఆగస్టు 16న నిర్వహించిన 44వ 'ఇండియా డే పరేడ్' అత్యంత వైభవంగా జరిగింది. ఈ ప్రతిష్టాత్మక వేడుకకు టాలీవుడ్, బాలీవుడ్ నటి పూజా హెగ్డే ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పసుపు రంగు సాంప్రదాయ దుస్తుల్లో ఆమె మెరిసిపోతూ భారతీయులందరినీ ఆకట్టుకున్నారు. విదేశాల్లో భారతీయ సంస్కృతిని చాటిచెప్పే ఈ వేడుకలో పూజా హెగ్డే సందడి చేయడం మనందరికీ ఎంతో గర్వకారణంగా మారింది. అమెరికా వీధుల్లో భారతీయ కోలాహలం: ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ (ఫీఐఎ) ఆధ్వర్యంలో జరిగిన ఈ పరేడ్, భారతదేశం వెలుపల జరిగే అతిపెద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఒకటిగా నిలిచింది. ఇక మాడిసన్ అవెన్యూలోని ఈస్ట్ 38వ వీధి నుండి ఈస్ట్ 27వ వీధి వరకు ఈ వేడుకలు ఎంతో ఉత్సాహంగా సాగాయి. న్యూయార్క్ వీధులన్నీ భారతీయ జెండాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో మారుమోగిపోయాయి. ప్రత్యేక ఇతివృత్తంతో స్వాతంత్ర్య వేడుకలు: ఈ ఏడాది వేడుకలను "సాంప్రదాయంలో సామరస్యం" అనే ప్రత్యేక ఇతివృత్తంతో నిర్వహించారు. భారతదేశ స్వాతంత్ర్య 80వ వార్షికోత్సవానికి చిహ్నంగా ఈ కార్యక్రమం నిలిచింది. ఇక విదేశాల్లో ఉంటున్న భారతీయులంతా ఒక్కటై తమ దేశభక్తిని, ఐక్యతను చాటుకోవడానికి ఈ వేడుక ఒక వేదికగా ఉపయోగపడింది. బుల్లితెర నటుల సందడి: ఈ పరేడ్‌లో పూజా హెగ్డేతో పాటు ప్రముఖ టీవీ సిట్‌కామ్ 'తారక్ మెహతా కా ఊల్టా చష్మా' నటీనటులు కూడా పాల్గొని రచ్చ చేశారు. దిలీప్ జోషి (జేఠాలాల్), బల్విందర్ సింగ్ సూరి (రోషన్ సింగ్), నితీష్ భలుని (టప్పు), సోనాలికా జోషి (మాధవి), అమిత్ భట్ (చంపక్‌లాల్) మరియు మందార్ చంద్వద్కర్ (భిడే) తమ నటనతో, సందడితో అభిమానులను అలరించారు. వేడుకల అనంతరం పూజా హెగ్డే అక్కడి ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. "వేలాది మంది భారతీయులు న్యూయార్క్‌లో మన సంస్కృతిని గర్వంగా చూపించడం నిజంగా గొప్ప విషయం. ఇక ఈ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొనడం నాకెంతో గర్వంగా, గౌరవంగా ఉంది. ఈ తీపి జ్ఞాపకం నా గుండెల్లో ఎప్పటికీ ఉండిపోతుంది" అని ఆమె రాసుకొచ్చారు. గ్లోబల్ స్టేజ్‌పై భారతీయ అందం: గ్లోబల్ వేదికపై మన మాతృభూమికి ప్రాతినిధ్యం వహిస్తూ పూజా హెగ్డే ఎంతో గౌరవంగా, హుందాగా వ్యవహరించారు. పసుపు రంగు చీరలో ఆమెను చూసిన అభిమానులు "గ్లోబల్ స్టేజ్‌పై ఇండియాను ఎంతో చక్కగా రిప్రజెంట్ చేశారు" అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. విదేశీ గడ్డపై మన సంస్కృతిని సగర్వంగా చాటిచెప్పిన ఈ వేడుక ప్రతి ఒక్కరి హృదయాలను గర్వంతో నింపేసింది.

## యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: మచిలీపట్నం బృందావన్ థియేటర్ నందు ఈరోజు కృష్ణాష్టమి సందర్భంగా బందరు నియోజకవర్గ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు పల్లపాటి సుబ్రహ్మణ్యం (చినబాబు) ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొలత గోపూజ అనంతరం శ్రీకృష్ణుడికి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలు బాలకృష్ణుడు మరియు రాధా వేషాలతో చూపరులను ఆనందింప చేశారు. ఈ కార్యక్రమానికి బందరు నియోజకవర్గ ప్రముఖులు అందరు హాజరైనారు. హాజరైన వారిలోకొల్లు రవీంద్ర, రొండి కృష్ణ, వేమూరి నాగార్జున, బండి రామకృష్ణ,పేర్ని కృష్ణమూర్తి(కిట్టు), కుంచె నాని,బొర్రా శ్రీనివాస్,గొరిపర్తి విశ్వనాధ బాబు,గొరిపర్తి బసవేశ్వర బాబు,బోయిన వెంకటేశ్వరరావు,పల్లపాటి చినబాబు,గొరిపర్తి రాము, ఆరేపు లక్ష్మణ కుమార్, దేవన బోయిన వెంకట కృష్ణారావు,ఎంపరాల సత్యనారాయణ, తోట నాంచారయ్య,సంద్రం సూర్య ప్రకాష్,నేలపాల రామకృష్ణ, బోయిన అంతర్వేది, గంగుల నాంచారయ్య, దేవన బోయిన రామాంజనేయులు,చేయబోయిన నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ హుస్సేన్ షా కవి పురస్కారాలు





అమరావతి, సెప్టెంబర్ 4, శ్రీవార్త న్యూస్:: ఈనెల తొమ్మిదో తేదీన పిఠాపురం ఆశ్రమంలో శ్రీ విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నేతృత్వంలో డా.ఉమర్ ఆలీషా సాహితీ సమితి బ్రహ్మర్షి శ్రీ హుస్సేన్ షా 121 వ జయంతి సభలో ఆచార్య విస్తాలి శంకర్ రావు,





చెన్నై. శ్రీమతి లక్ష్మీ కాంతి, వేమూరి (గిడుగు) హైదరాబాద్ వీరిరువురికి శ్రీ హుస్సేన్ షా కవి పురస్కారాలు( ఒక్కొక్కరికి రు.50,116, జ్ఞాపిక), విశిష్ట సేవాభినందన సత్కారాలు నలుగురు ప్రముఖులకు (ఒక్కొక్కరికి రు.10,116 లు)శ్రీ త్సవటపల్లి మురళీకృష్ణ , శ్రీ పేరూరి సూరిబాబు , డాక్టర్ పింగళి ఆనంద కుమార్ , కె.స్వర్ణలత కు అందించడం జరుగుతుందని నవమ పీఠాధిపతులు, సమితి అధ్యక్షులు డా. ఉమర్ ఆలీషా , సమితి కార్యదర్శి దాయన చంద్రజీ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## బెంగళూరు యలహంకలో ఘనంగా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు



బెంగళూరు శ్రీ వార్త న్యూస్: కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని యలహంకలో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను ప్రపంచ చిరంజీవి యువసేన ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రపంచ చిరంజీవి యువసేన అధ్యక్షుడు పురుషోత్తం, మిత్రబృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు రాధా రంగా మిత్రమండలి ఆంధ్ర-తెలంగాణ అధ్యక్షుడు, జనసేన నాయకుడు బుల్లెట్ ధర్మారావు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం అభిమానులకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా బుల్లెట్ ధర్మారావు మాట్లాడుతూ, కేరళలోని తిరువనంతపురం శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయంలో పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని పూజలు నిర్వహించి బెంగళూరు చేరుకున్నానని తెలిపారు. పవన్ కళ్యాణ్ నిండు నూరేళ్ల ఇలాగే పుట్టినరోజులు జరుపుకోవాలని, తిరిగి ప్రజాక్షేత్రంలో పేద ప్రజలకు అండగా నిలిచి ఏపీని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో జయరాం కృష్ణ, నారాయణస్వామి, శివారెడ్డి, శ్రీరామ్, తుకారాం, సీన, వరదరాజు, భయ్యారెడ్డి, రాజేష్, రఘుబాబు, దామోదర్, అంజి, మంజు, రవికుమార్, శివ, తార్ రెడ్డి, విజయ్ తదితర పవన్ కళ్యాణ్, చిరంజీవి, మెగా ఫ్యామిలీ అభిమానులు కులమతాలకు అతీతంగా పాల్గొని జయప్రదం చేశారు.

## పామర్రులో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



పామర్రు,శ్రీవార్త న్యూస్ : పామర్రు మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి.పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారిని దివ్యమైన ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. వేకువజాము నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి ఆలయానికి పోటెత్తారు. అర్చకులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కాగా, సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సాంప్రదాయ ఉట్టి కొట్టే కార్యక్రమం (ఉట్లోత్సవం) అత్యంత కోలాహలంగా చిన్నారులతో కలిసినిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ అధికారి జె వి రావు పర్యవేక్షి0చారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



బంటుమిల్లి శ్రీవార్త న్యూస్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు.కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం గ్రామంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ (కేడీసీసీ బ్యాంక్) శేరిలక్ష్మీపురం నూతన బ్రాంచి ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మరియు కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ , పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొని నూతన బ్రాంచిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత



కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతుల సంక్షేమానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఎంతో కీలకమైనవని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అవసరమైన రుణ సౌకర్యాలు, వ్యవసాయ సేవలు అందించడంలో సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.రైతుల అవసరాలను గుర్తించి వారికి అందుబాటులో ఉండే విధంగా సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ మాట్లాడుతూసహకార సంఘాల ద్వారా రైతులకు సకాలంలో రుణ సౌకర్యాలు, వ్యవసాయ ఇన్పుట్స్ మరియు ఇతర అవసరమైన సేవలు అందించడంలో పాలకవర్గ సభ్యుల బాధ్యతలు అత్యంత కీలకమని అన్నారు. సహకార సంఘాల పనితీరు, ఆర్థిక వ్యవహారాలు, రైతులకు అందిస్తున్న సేవలు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై కార్యక్రమంలో వివరణాత్మక ప్రజెంటేషన్లు అందించారు. నూతన బ్రాంచి అందుబాటులోకి రావడంతో లక్ష్మీపురం మరియు పరిసర ప్రాంతాల రైతులు, ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ కానున్నాయని నాయకులు తెలిపారు. రైతుల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా సహకార బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ శ్యాంబాబు కూటమి నాయకులు, కార్యకర్తలు, సహకార సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

### మనం ధర్మాన్ని రక్షిద్దాం.. మనల్ని రక్షించే బాధ్యత ఆ పరమాత్ముడు తీసుకుంటాడు

### మచిలీపట్నంలో పలు ప్రాంతాల్లో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: కృష్ణాష్టమి అంటే కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, అది సమాజానికిచ్చే ఒక గొప్ప సందేశమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నంలోని పలు ప్రాంతాల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. బందరుకోట రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవులకు నైవేద్యం సమర్పించారు.







ఆలయానికి వచ్చేసిన భక్తులతో కోలాటం, కర్రసాము నిర్వహించారు. ఉట్టి కొట్టి సంబరాలు జరుపుకున్నారు.గొడుగుపేటలో శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలో ఉన్న పిల్లల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక పోటీలు, నృత్య ప్రదర్శనల్లో పాల్గొన్నారు. బాల గోపాలునితో సరదాగా గడిపారు. బృందావన్ థియేటర్లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. సర్కిల్ పేట సంతాన వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆర్.గొల్లపాలెం గ్రామంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో భక్తులకు భోజనం వడ్డించారు. సర్కిల్ పేటలోని మంత్రిగారి గోశాలలో గోవులకు పలహారం అందించారు. నిజాంపేట బొమ్మలమెడ ఆలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. వేణుగానంతో జగమంతామురిపించిన బాల గోపాలుని కృపతో రాష్ట్రంలోని ప్రతి ఇంటా సుఖసంతోషాలు, శాంతి సైభాగ్యాలు వెల్లివిరియాలని కోరుకున్నట్లు తెలిపారు. లోకంలో అధర్మం పెరిగిపోయినప్పుడు, ధర్మాన్ని రక్షించడానికి మరియు దుష్టులను శిక్షించడానికి భగవంతుడు అవతరిస్తాడనే భరోసా ఈ కృష్ణాష్టమి వేడుకలు. సమస్త మానవాళికి ధర్మ మార్గాన్ని, కర్మ సిద్ధాంతాన్ని భగవద్గీత రూపంలో అందించిన జగద్గురువు, శ్రీమహావిష్ణువు ఎనిమిదవ అవతారమే శ్రీకృష్ణ జన్మాష్టమి. అలాంటి వేడుకలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనందంగా ఉంది. పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ అన్న స్వామివారి సూక్తి ప్రకారం, సమాజంలో చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ జన్మాష్టమిని జరుపుకుంటున్నాం. ఇలాంటి వేడుకల్లో భక్తులందరూ పాల్గొని, ఆ గోపాలకృష్ణుని కృపాకటాక్షాలు పొందాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మంత్రి కొల్లు రవీంద్ర వేడుకున్నట్లు తెలిపారు.



# రైతు బజార్లలో నాణ్యమైన బియ్యం విక్రయాలు

### ....జిల్లా పౌరసరఫరాల అధికారి టీ .శివరామ ప్రసాద్




మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకు అందుబాటులో ఉంచే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన బిమొబైల్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రాంలో భాగంగా కృష్ణా జిల్లాలో ఏర్పాటు చేసిన రైస్ మిల్లులు, రైతు బజార్లలోని రైస్ కౌంటర్ల ద్వారా బియ్యం విక్రయాలు జరుగుతున్నాయని జిల్లా పౌర సరఫరాల అధికారి టి. శివరామ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం జిల్లా పౌర సరఫరాల అధికారి మచిలీపట్నం నగరంలోని సాయిబాబా గుడి సమీపంలోని రైతు బజార్, చింతచెట్టు సెంటర్ రాజాపేట ప్రాంతంలోని రైతు బజార్లను సందర్శించి, అక్కడ విక్రయించిన బియ్యం కొటర్లను తనిఖీ చేశారు.



విక్రయాల వివరాలు:

- సాయిబాబా గుడి సమీప రైతు బజార్, మచిలీపట్నం: 905 కార్డుదారులు - 175 క్వింటాళ్లు - చింతచెట్టు సెంటర్, రాజాపేట రైతు బజార్: 72 కార్డుదారులు - 630 కిలోలు

జిల్లాలో రైస్ కొటర్ల వద్ద మొత్తం విక్రయాలు: జిల్లాలో 10 రైతు కొటర్ల రైతు బజార్లలో మరియు 30 రైస్ కొటర్ల రైస్ మిల్లుల వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా 3200 మంది కార్డుదారులకు 845.53 క్వింటాళ్ల బియ్యం విక్రయించారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల అధికారి మాట్లాడుతూ ప్రతిరోజూ జరిగిన విక్రయాల వివరాలను అదే రోజున ఆన్ లైన్ లో నమోదు చేయడంతో పాటు రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బియ్యం కొటర్ల ద్వారా ప్రజలకు నాణ్యమైన బియ్యం సరసమైన ధరలకు అందుబాటులో ఉందనే విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేసేలా విస్తృత ప్రచారం చేయాలని, కొటర్ల వద్ద బియ్యం నిల్వలు తగినంతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతు బజార్లలో ఏర్పాటు చేసిన బియ్యం కొటర్ల ద్వారా నాణ్యమైన బియ్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి టీ శివరామ ప్రసాద్ ప్రజలను కోరారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



అవనిగడ్డ సెప్టెంబర్ 4 శ్రీ వార్త : పులిగడ్డ వద్ద జాతీయ రహదారిపై టోల్గేట్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రేపల్లెకు చెందిన పిక్కిణి. రాఘవేంద్ర చరణ్ (35) మృతి చెందినట్లు ఏ ఎస్ ఐ జె. శ్రీనివాసరావు తెలిపారు. రాఘవేంద్ర చరణ్ రేపల్లె వైపు నుంచి పులిగడ్డ వైపు ద్విచక్ర వాహనంపై వస్తు ఎదురుగా ఉన్న మరో యాక్టివ్ స్కూటీని ఢీ కొట్టి కుడి వైపు పడటంతో ఎదురుగా వేగంగా వచ్చిన లారీ అతని పైనుండి దూసుకు వెళ్ళింది అని, దీనితో తీవ్ర గాయాలకు గురైన రాఘవేంద్ర చరణ్ సంఘటన స్థలంలోనే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

## గోపు వారి ఇంట ఘనంగా కృష్ణాష్టమి వేడుకల



నందిగామ, సెప్టెంబర్ 4, శ్రీ వార్త న్యూస్:కృష్ణాష్టమి అంటే కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, అది సమాజానికిచ్చే ఒక గొప్ప సందేశమని గోపు వారి ఇంట్లో జరిగిన వేడుకల్లో తెలిపారు. నందిగామ పట్టణంలోని రైతుపేట సెంటర్ నందు గోపు వారి ప్లాజాలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలు బంధుమిత్రులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.వేణుగానంతో జగమంతామురిపించిన బాల గోపాలుని కృపతో రాష్ట్రంలోని ప్రతి ఇంటా సుఖసంతోషాలు, శాంతి సైభాగ్యాలు వెల్లివిరియాలని కోరుకున్నట్లు తెలిపారు. లోకంలో అధర్మం పెరిగిపోయినప్పుడు, ధర్మాన్ని రక్షించడానికి మరియు దుష్టులను శిక్షించడానికి భగవంతుడు అవతరిస్తాడనే భరోసా ఈ కృష్ణాష్టమి వేడుకలు. సమస్త మానవాళికి ధర్మ మార్గాన్ని, కర్మ సిద్ధాంతాన్ని భగవద్గీత రూపంలో అందించిన జగద్గురువు, శ్రీమహావిష్ణువు ఎనిమిదవ అవతారమే శ్రీకృష్ణ జన్మాష్టమి. అలాంటి వేడుకలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనందంగా ఉంది. పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ అన్న స్వామివారి సూక్తి ప్రకారం, సమాజంలో చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ జన్మాష్టమిని జరుపుకుంటున్నాం. ఇలాంటి వేడుకల్లో భక్తులందరూ పాల్గొని, ఆ గోపాలకృష్ణుని కృపాకటాక్షాలు పొందాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని గోపు పూర్ణచంద్ర రావు, గోపు కృష్ణా తెలిపారు.



## ఘనంగా శ్రీకృష్ణద్వారకాలయం నందు కృష్ణాష్టమి వేడుకలు



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ : మండల కేంద్రమైన ఘంటసాల ఆంధ్ర బ్యాంక్ సెంటర్ నందు శ్రీకృష్ణద్వారకాలయం నందు కృష్ణాష్టమి వేడుకలు శ్రీకృష్ణద్వారకలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ విగ్రహానికి వందలాది మంది భక్తులు పాల్గొని విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధులలో శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని మేళ తాళాలు, డప్పు వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీకృష్ణుని దర్శించి టెంకాయలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు శ్రీకృష్ణ ద్వారకాలయ కమిటీ, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు....

## దేశాన్ని, సమాజాన్ని నిర్మించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం - కృష్ణా యూనివర్సిటీ వీసీ డా. కోన రాంజీ

మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: దేశాన్ని, సమాజాన్ని నిర్మించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని కృష్ణా యూనివర్సిటీ ఉపకులపతి







డా. కోన రాంజీ అన్నారు. ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సెంట్ జాన్స్ స్కూల్లో జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 220 మంది ఉపాధ్యాయులు, విద్యాసంస్థల అధినేతలు, మానవత




స్వచ్ఛంద సేవా సంస్థ సేవకులకు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా. కోన రాంజీ మాట్లాడుతూ ఉత్తేజిత ప్రసంగం చేశారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నేత కొమరగిరి చంద్రశేఖర్, స్టార్ కాలేజీ డైరక్టర్ పీ శ్రీరామ్, బి అయ్యప్ప స్వామి,మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు జి.కిషోర్ ముదిగొండ శాస్త్రి,జి. గోపీచంద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఫణి కుమార్ పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రూ.1,800 కోట్ల బిజినెస్ వృద్ధి

### కంప్యూటరీకరణ యుపీఐతో కేడీసీసీ బ్యాంక్‌లో సరికొత్త మార్పులు.....కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం



కృష్ణాజిల్లా శ్రీవార్త న్యూస్: తాను కేడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత బ్యాంక్ వ్యాపారాన్ని రూ.1,800 కోట్ల మేర పెంచామని మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ తెలిపారు.కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం గ్రామంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ కేడీసీసీ శేరిలక్ష్మీపురం నూతన బ్రాంచిని గురువారం ఆయన, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ రఘురామ్ మాట్లాడుతూ రైతులు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి కంప్యూటరీకరణకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. పీఏసీఎస్ లను ఆధునికీకరించడం ద్వారా రుణాలు, డిపాజిట్లు వేగంగా, పారదర్శకంగా అందుతున్నాయని చెప్పారు.సహకార రంగంలో పీఏసీ ఎస్ స్థాయిలో యుపిఐ



సేవలను ప్రవేశపెట్టిన తొలి బ్యాంక్‌గా కేడీసీసీ ప్రత్యేక గుర్తింపు సాధించిందని, దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ చెల్లింపులు సులభతరమయ్యాయని తెలిపారు.అదేవిధంగా బంటుమిల్లి బ్రాంచి పరిధిలో డ్వాక్రా మహిళలకు రూ.2.50 కోట్ల రుణాలను పంపిణీ చేశామని, మహిళా సాధికారతకు కేడీసీసీ అండగా ఉంటుందని అన్నారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యమని,పీఏసీ ఎస్ లను గ్రామీణ ఆర్థిక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పీఏసీఎస్ లు రైతుల సంక్షేమానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కీలకమన్నారు.కార్యక్రమంలో కేడీసీసీ సీఈవో శ్యామ్ మనోహర్, జీఎం చంద్రశేఖర్, కూటమి నాయకులు, సహకార సంఘాల ప్రతినిధులు, రైతులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

### సంతన వేణుగోపాలస్వామి ఆలయంలో

## కన్నుల పండుగగా కృష్ణాష్టమి

### ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: మచిలీపట్నంలోని పురాతన, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సంతన వేణుగోపాలస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కన్నుల పండుగగా వైభవంగా జరిగాయి. సెప్టెంబర్ 4న ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో, వివిధ రకాల పూలతో అలంకరించారు. తెల్లవారుజాము నుండే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, తులసి అర్చనలు నిర్వహించారు.

మంత్రి కొల్లు రవీంద్ర స్వామివారి దర్శనం

వేడుకల్లో ముఖ్య అతిథిగా రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీకృష్ణుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఘనంగా అన్నసమారాధన

ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. వేలాది మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, అయ్యప్ప కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: స్థానిక శిడింబి అగ్రహారంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్లస్టర్ ప్రిన్సిపాల్ ఎస్. శ్రీనివాస్ ఆదేశానుసారం, ఈ-చామ్స్, ఈ-కిడ్స్ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ప్రిన్సిపాల్ సి.హెచ్. సాయిసుధీర్ అధ్యక్షతన వేడుకలు జరిగాయి.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సాయిసుధీర్ మాట్లాడుతూ కృష్ణాష్టమి ప్రాముఖ్యతను వివరించారు. ఆయన పర్యవేక్షణలో కృష్ణాష్టమి ఘట్టాలను వివరించే వివిధ రకాల అలంకరణల్లో బాలబాలికలు ప్రదర్శనలు ఇచ్చారు.విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమాల అనంతరం ఉపాధ్యాయులు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.విద్యార్థులలో తెలుగు పండుగల పట్ల ప్రత్యేక అభిమానం కలిగేలా నిర్వహించిన ఈ వేడుకల్లో క్లస్టర్ ప్రిన్సిపాల్ ఎస్. శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సి.హెచ్. సాయిసుధీర్, హైస్కూల్ అకడమిక్ డీన్ జె. భవీంద్ర, టెన్త్ క్లాస్ ఇంచార్జ్ పరసా రాము, ఈ-చామ్స్ వైస్ ప్రిన్సిపాల్ ఎం. దివ్యవాణి, ఈ-కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ డి. చందన, పీఈటీ విజయ్, ఏవో వి. రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



## సూపర్ ఎల్-నీనో నేపథ్యంలో శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

--ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

-కృషి విజ్ఞాన కేంద్రంలో ఎల్-నీనో అవగాహన సదస్సు



ఘంటసాల, శ్రీ వార్త న్యూస్ : సూపర్ ఎల్-నీనో ప్రభావం నేపథ్యంలో రైతు సోదరులు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారిచే ఎల్-నీనో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కృష్ణానదిలో నీటి కొరత నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్మించిన పట్టిసీమ ప్రాజెక్టు నేడు కొంతమేరకు కృష్ణా డెల్టా రైతులను ఆదుకుందన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో ఇంకా పదిహేను వేల ఎకరాల్లో నాట్లు పడాల్సి




ఉందన్నారు. నాట్లు వేయని రైతులకు సహాయం చేసే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఖచ్చితంగా ఆలోచించాలని బుద్ధప్రసాద్ విజ్ఞప్తి చేశారు. తాను ఉమ్మడి రాష్ట్ర మంత్రిగా, డిప్యూటీ స్పీకరుగా, ఎమ్మెల్యేగా ఎన్ని పదవులు చేసినా కృష్ణా డెల్టా పరిరక్షణ పోరాట సమితి కన్వీనర్ పదవి మాత్రమే సంతృప్తినిచ్చిందన్నారు. కృష్ణా డెల్టా వారు మూడు పంటలు పండించుకుంటున్నారనే అపోహలను 2002లో కృష్ణా డెల్టా ఉద్యమంతో తొలగించి, కృష్ణా డెల్టా రైతుల కష్టాలు వెలుగులోకి తెచ్చామన్నారు. కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో మరోసారి తెలంగాణ వారి కారణంగా కృష్ణా డెల్టాకు ఇబ్బంది వచ్చినప్పుడు అధికార పార్టీలో ఉన్నప్పటికీ అవనిగడ్డలో దీక్ష చేపట్టి సాగునీరు సాధించినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో పట్టిసీమ నీటిని అందించే కాలువలపై అక్రమ మోటార్లను తొలగింపచేసి ఇక్కడి రైతులకు న్యాయం చేసినట్లు తెలిపారు. రైతులకు న్యాయం చేసే అంశంలో రాజీపడేది లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రపంచ దేశాల్లో విస్తరించిన సూపర్ ఎల్-నీనో దుష్ప్రభావంతో ఎదురైన తీవ్ర సాగునీటి కొరత నేపథ్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా రైతులు ముందుకు సాగాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ పరిస్థితులను రైతులు అర్థం చేసుకుని సమస్య నుంచి ఎలా బయటపడాలో ఆలోచించాలని ఎమ్మెల్యే కోరారు. గతంలో తక్కువ నీటితో ఎక్కువ పంట పండించిన అనుభవం కలిగిన దివిసీమ రైతులు ఇప్పుడు ఎదురైన ఎల్-నీనో ప్రభావాన్ని కూడా రైతులు శాస్త్రవేత్తల సూచనలతో అధిగమించాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని ఆరాధించే మన సంస్కృతిలో నదిని తల్లిగా, చెట్టును దేవతగా పూజిస్తామన్నారు. ప్రకృతిని కాపాడుకోకపోతే విపత్తులు సంభవిస్తాయన్నారు. చెట్లను కాపాడుకున్నప్పుడే వాతావరణం చల్లగా ఉండి ప్రకృతి అనుకూలంగా మారుతుందన్నారు. ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ మాగాణి రైతులు మినుము ముందుగా వేయవద్దని సూచించారు. ఇప్పటికీ వరి వేయని రైతులు అవకాశం ఉంటే పెసలు వేసుకోవాలని సూచించారు. ఐసీఏఆర్ అటారి జోన్- ఎక్స్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా మాట్లాడుతూ ఇప్పుడు పడుతున్న వర్షాలు కొంత ఊరట కలిగించినప్పటికీ, రాబోయే పది రోజుల్లో కురిసే వర్షాలు కీలకంగా తీసుకొని త్వరితగతిన ప్రణాళిక రూపకల్పన చేస్తామని ప్రకటించారు. వర్షాలు తగ్గటంతో ఎదురయ్యే చీడపీడల బారిన పంటలు పడకుండా రైతులకు సకాలంలో సూచనలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. విలువ ఆధారిత వస్తు ఉత్పత్తుల తయారీపై రైతులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. గత ఎల్-నీనోల సమయంలో వర్షాభావ పరిస్థితిని అధిగమించి పంటలు పండించిన అనుభవాల దృష్ట్యా రైతులు అవగాహనతో ముందుకు సాగాలని కోరారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏ.మణి, విస్తరణ విభాగం డైరెక్టర్ డాక్టర్ జీ.రామచంద్రరావు, పరిశోధన విభాగం డైరెక్టర్ డాక్టర్ వీ.సుమతి, వ్యవసాయ డీన్స్ డాక్టర్ సీహెచ్.శ్రీనివాసరావు, జగన్నాధరావు, సీఈ డాక్టర్ మోహన్ రెడ్డి, గుంటూరు లామ్ ఏడీఆర్ డాక్టర్ ఎన్.వీ.వీ.ఎస్. దుర్గాప్రసాద్, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి కే.జ్యోతి రమణి, ఉద్యానవన శాఖ జిల్లా అధికారిణి కే.జ్యోతి, ప్రకృతి సేద్యం డీపీఎం పార్థసారథి, బీజేపీ రాష్ట్ర కౌలు రైతుల సంఘం అధ్యక్షులు జీవీ నగరాయలు, ఘంటసాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ డీ సుధారాణి, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, శాస్త్రవేత్తలు, రైతులు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలు, సందేహాలను శాస్త్రవేత్తలు విని వాటిని నివృత్తి చేశారు.

## రంగ రంగ వైభవంగా పుట్టగుంట పెళ్లి వేడుకలు



కంకిపాడు శ్రీ వార్త న్యూస్ : విశ్వహిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ మరియు లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ పుట్టగుంట వెంకట సతీష్ కుమార్ కుమార్తె డాక్టర్ అన్విత నిశ్చయ తాంబూలాలు వేడుక కంకిపాడు ఆయాన్ కళ్యాణ్ మండపం లో ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐ.జి మొవ్వ వెంకట రాజేష్ కుమారుడు డాక్టర్ దివ్యంత చౌదరితో నిత్య తాంబూలాలు కార్యక్రమం కన్నుల పండుగ జరిగింది. శుక్రవారం ఉదయం 10 గంటల 30 నిమిషాలకు జరిగిన ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వి రమణ,మాజీ మంత్రి దేవినేని ఉమా, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర,కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్,విజయవాడ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ,మాజీ ఎమ్మెల్సీ చిగురుపాటి వరప్రసాద్, మాజీ మంత్రి గంట శ్రీనివాసరావు వివిధ రాజకీయ పార్టీ నాయకులు సినీ నటులు సుమన్, బాబు మోహన్ శివాజీ, మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ పలువురు జిల్లా లయన్స్ మాజీ గవర్నర్లు పాల్గొన్నారు. సినీ సెట్టింగులు కల్పించే పూల డెకరేషన్ తో నిశ్చయ తాంబూలం జరిగింది.ఆహుతులు అందరికీ పుట్టగుంటవారు రెండు మొక్కలు గిఫ్ట్ గా అందజేశారు.



### వేమవరం కొండలమ్మ ఆలయంలో

## సామూహిక వరలక్ష్మీ వ్రతం



కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్: కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలోని శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు వైభవంగా జరిగాయి. గురువారం ఉదయం 10 గంటల నుండి దేవస్థాన ముఖ్య అర్చకులు రుద్రపాక శివ సంతోష శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, కలశావాహన, వరలక్ష్మీ పూజ కార్యక్రమాలను 300 మంది మహిళలతో సామూహికంగా నిర్వహించారు.పూజా కార్యక్రమం అనంతరం టీడీపీ నాయకులు కొడాలి రామరాజు కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. సుమారు 1,200 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ముఖ్య అతిథులుగా ఏపీ ఎస్ డబ్లయు సీ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు చేకూరు జగన్మోహనరావు, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు. వారిని ఆలయ మర్యాదలతో స్వాగతించి దర్శనానంతరం అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి ప్రసాదం అందజేశారు. అన్నప్రసాద దాత కొడాలి రామరాజు, ఆయన కుటుంబ సభ్యులను దేవస్థాన మర్యాదలతో సత్కరించారు.కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్ రావు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు,తూము రాజ్యలక్ష్మి, గుడ్లవల్లేటి వాణి, పెదిబోయిన శ్యామలాదేవి, ముగం ఆంజనేయులు, మన్నెం వీరనాగేంద్రరావు, వడ్లమూడి రవీంద్రబాబు, పెన్నేరు శేఖర్, ఉస్తేల కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



### కూనపరెడ్డి రుతేష - నాగ సందీప్

## దంపతులను ఆశీర్వదించిన విక్కుర్తి



అవనిగడ్డ సెప్టెంబర్ 4 శ్రీ వార్త: అవనిగడ్డ గ్రామ వాస్తవ్యులైన కూనపరెడ్డి రామకృష్ణ - శాంతకుమారి దంపతుల కుమార్తె రుతేషకు అలాగే నాగాయలంక గ్రామ వాస్తవ్యులైన వసంతరావు మురళీకృష్ణ - శివకుమారి దంపతుల కుమారుడు నాగ సందీప్ కు అవనిగడ్డ మండలంలోని ాకన్వేషన్ హాల్ నందు శుక్రవారం ఉదయం 10: 39 నిమషాలకు కళ్యాణం వైభవంగా జరిగింది. కూనపరెడ్డి రామకృష్ణ - శాంతకుమారి దంపతుల ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు హాజరయ్యి రుతేష - నాగ సందీప్ నూతన వదూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## విషయంలో కనుల పండగగా కృష్ణాష్టమి వేడుకలు



అవనిగడ్డ సెప్టెంబర్ 4 శ్రీ వార్త: దివిషయంలో కృష్ణాష్టమి వేడుకలు కనుల పండుగగా నిర్వహించారు. గీత మందిరంలో కృష్ణాష్టమిని పురస్కరించుకొని స్వామివారికి 108 లీటర్ల తో గో షేరాభిషేకంతో అభిషేకాలు నిర్వహించగా పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వై శ్రీహరిబాబు ఎంపీపీ సుమతీదేవి రెడ్డత్తు రామ్మోహన్రావు విజయసారథి దంపతులు పాల్గొని అభిషేకాలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామివారికి విశేష పూజలు అలంకారాలు నిర్వహించగా చిన్ని కృష్ణుని కి ఉయ్యాలలో అర్చనలు చేశారు. ఈ సందర్భంగా విష్ణు సహస్రనామ అర్చన. శ్రీ లక్ష్మీ సహస్రనామ అర్చనలతో సువర్ణ పుష్పాలతో మహిళా భక్తులు పాల్గొని సామూహికంగా కుంకుమ అర్చనలు నిర్వహించారు. అర్చక స్వాములు దివి నరసింహమూర్తి .పవన్ కుమార్ శర్మ. సతీష్. దివి సీతారామ వెంకటకృష్ణ తదితరులు అర్చనలో పాల్గొని భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. అదేవిధంగా లక్ష్మీనారాయణ స్వామివారి ఆలయంలో స్వామివారికి ఉంజల్ సేవ నిర్వహించి గ్రామ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు విశేష ఆకర్షణగా నిలిచారు,



శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను గుర్తు చేసుకుంటూ కృష్ణ తత్వాన్ని గ్రామాల్లోని పిల్లలకు బోధిస్తూ కృష్ణుడు చేసిన చిన్నతనంలో వెన్నదొంగగా గోపికలతో గోప బాలుడిగా గోపాలకృష్ణుడిగా చెడుతో పోరాటం మేనమామ కంసుని వద ర తదుపరి ధర్మ పరిరక్షణ కోసం పాండవ పక్షపాతిగా కురుక్షేత్ర యుద్ధంలో భగవద్గీత బోధించిన జ్ఞాన స్వరూపుడి దేవాది దేవుడు అయినా శ్రీకృష్ణుని జన్మాష్టమి పురస్కరించుకొని కొత్తపేట గ్రామంలో ఉట్టికొట్టే సాంప్రదాయం కొనసాగిస్తూ పిల్లలను ప్రోత్సహిస్తూ వారికి మిఠాయిలు పంచిన సాంగ్ కార్యకర్తలు నాయకులు వేముల నరసింహారావు. తుంగల వెంకటగిరి. భూపతి సుబ్రమణ్యం. భోగాది చంద్రశేఖర్. సంతోష్ తేజ. కొండవీటి రామకృష్ణ. మునగాల బాలకృష్ణారావు. సోబిలి ఏడుకొండలు. కొత్తపేట గ్రామ పెద్దలు పిల్లలు పాల్గొని ఉత్సాహంగా ఉల్లాసంగా నిర్వహించారు,

## శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు

అవనిగడ్డ సెప్టెంబర్ 4 శ్రీ వార్త : దివిసీమలో అతి పురాతన దేవాలయంగా వెలుగొందుతున్న శ్రీ రాజరాజేశ్వరి సహిత రాజశేఖర్ స్వామి వారి దేవాలయంలో రాజేశ్వరి దేవి అమ్మవారిని పసుపు కొమ్ములతో ఆలయ అర్చకులు సుందరంగా అలంకరించారు. శ్రావణ మాసం నాలుగవ శుక్రవారం నీ పురస్కరించుకొని అమ్మవారికి వేకువజామునే ఆలయ అర్చకులు విశేష పూజలు అర్చనలు నిర్వహించారు. మహిళా భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారికి కుంకుమ పూజలు లలిత సహస్రనామ పారాయణం సామూహికంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పంచ హారతులు ఇవ్వగా కర్పూర జ్యోతి వెలుగులో అమ్మవారు కలకల్లారారు. భక్తులు భారీగా తరలి రావడంతో ఆలయ కార్యనిర్వాహన అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు ఆలయ చైర్మన్ పాలకవర్గ సభ్యులు ఆలయ సిబ్బంది భక్తులకు కావలసిన ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.

### చల్లరస్తా వేణుగోపాలస్వామి ఆలయంలో

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: మచిలీపట్నం చల్లరస్తా వద్ద గల శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇవో తిక్కిశెట్టి మోహనరావు, ఆలయ చైర్మన్ ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, ధర్మకర్తలు సీతారావమ్మ, శాంతకుమారి, కోటేశ్వరమ్మ, అర్చకులు వాసు ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఐఉదయం సుప్రభాతం, తోమాలసేవ అనంతరం ఆలయ పురోహితులు దత్తు గోపూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ రొండి కృష్ణయాదవ్, బందరు కోట ఏకాంబరేశ్వర దేవాలయ చైర్మన్ బచ్చుల హరిబాబు, గౌరా శ్రీహరి, మాజీ కౌన్సిలర్ నాలి మాధవరావు, యాదవ ప్రముఖులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada ,Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a,near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001